RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 61 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | గురువారం , ఆగస్టు, 21 , 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 61 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Thusday, August, 21, 2025 | PAGES : 8 RS : 4 /- |



## ఆఫ్ఘనిస్థాన్‌లో ఘోర బస్సు

# ప్రమాదం...

## 71 మంది సజీవ దహనం

- మృతుల్లో 17 మంది చిన్నారులు
- ట్రక్కు, బైక్‌ను ఢీకొట్టి మంటల్లో చిక్కుకున్న బస్సు
- మృతులంతా ఇరాన్ నుంచి తిరిగొస్తున్న ఆఫ్ఘన్ వలసదారులు
- ప్రభుత్వ అధికార ప్రతినిధి ధ్రువీకరణ

ఆఫ్ఘనిస్థాన్: ఆఫ్ఘనిస్థాన్‌లో అత్యంత ఘోరమైన రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పశ్చిమ హెరాత్ ప్రావిన్స్ లో ప్రయాణికులతో వెళ్తున్న ఒక బస్సు, ట్రక్కును ఢీకొనడంతో భారీగా మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో 17 మంది చిన్నారులతో సహా 71 మంది సజీవ దహనమయ్యారు. ఈ విషయాన్ని ప్రభుత్వ అధికారులు బుధవారం అధికారికంగా ధ్రువీకరించారు. ప్రావిన్షియల్ ప్రభుత్వ అధికార ప్రతినిధి అహ్మదుల్లా ముత్తఖీ ఈ ఘటనపై స్పందించారు.





## హైదరాబాద్ అభివృద్ధికి

# ఎందరో కృషి

- హైటెక్ సిటీ కడతామన్నా వ్యతిరేకించారు
- అభివృద్ధిని కొనసాగించాలన్నదే మా పట్టుదల
- మూసీ ప్రక్షాళనతో ముందుకు సాగుతాం
- మరింత సుందర నగరంగా తీర్చిదిద్దుతాం
- ఇంటిగ్రేటెడ్ రిజస్ట్రార్ కార్యాలయ శంకుస్థాపనలో రేవంత్

హైదరాబాద్,తెలంగాణ దిశ : రాజీవ్ గాంధీ వల్లే ఐటీ రంగంలో చాలా మంది రాణిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆనాడు రాజీవ్ గాంధీ కంప్యూటర్ ను దేశానికి పరిచయం చేశారు.. పీవీ నర్సింహారావు స్పెషల్ ఎకనామిక్ జోన్ ను మంజూరు చేశారు.. నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హైటెక్ సిటీకి శంకుస్థాపన చేశారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఉమ్మడి రాష్ట్రంలో సీఎంలుగా వ్యవహరించిన చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాత్ర ఉందని వెల్లడించారు.



## ఢిల్లీలో అనూహ్య

# ఘటన

- సిఎంకు వినతిపత్రం ఇచ్చినట్లే ఇచ్చి దాడి
- సిఎం రేఖాగుప్తా చెంపపై కొట్టినయువకుడు
- దాడిని తీవ్రంగా ఖండించిన మాజీ సిఎం అతిషి

న్యూఢిల్లీ, : ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై ఓ యువకుడు దాడి చేశాడు. బుధవారం ఉదయం సివిల్ లైన్స్‌లోని సిఎం అధికారిక నివాసంలో జరిగిన జన్ సున్వై కార్యక్రమంలో ఈ ఘటన జరిగినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వర్గాలు తెలిపాయి. నిందితుడిని సంఘటనా స్థలం నుండి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.నిందితుడు మొదట ముఖ్యమంత్రికి ఫిర్యాదుగా ఒక పత్రాన్ని అందజేసి, ఆపై ఆమెపై దాడి చేసినట్లు– బిజెపి నాయకుడు ఒకరు తెలిపారు. సిఎం రేఖ గుప్తాపై జరిగిన దాడిని ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా తీవ్రంగా ఖండించారు. ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ దేవేందర్ యాదవ్ కూడా ఈ దాడిని ఖండించారు.



## సభలో ప్లకార్డులు, బ్యానర్లు

# నిషేధం

### సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించొద్దు విపక్షాలకు స్పీకర్ ఓం బిర్లా సూచన

న్యూఢిల్లీ: జూలై 21న ప్రారంభమైనప్పటి నుంచి ఉభయ సభల్లో బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ పక్రియపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం చర్చకు అంగీకరించడం లేదు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ హౌస్‌లో, వెలుపల ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నిరసనలు కొనసాగిస్తున్నారు.



## ఉపరాష్ట్రపతి పదవికి సీపీ రాధాకృష్ణన్

# నామినేషన్

- ప్రధాని మోదీ, అమిత్ షా, ఇతర కేంద్ర మంత్రుల హాజరు
- సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్
- ఎలక్టోరల్ కాలేజీలో మెజారిటీతో రాధాకృష్ణన్ గెలుపు ఖాయం..

ఢిల్లీ,: ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టం చోటుచేసుకుంది. అధికార ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ బుధవారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రుల సమక్షంలో ఆయన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఈ కార్యక్రమం ఎన్డీఏ కూటమి ఐక్యతను, బలాన్ని ప్రదర్శించేలా సాగింది. రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు చేసే సమయంలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వంటి అగ్రనేతలు ఆయన వెంట ఉన్నారు. కూటమిలోని కీలక నేతలంతా హాజరుకావడంతో ఈ కార్యక్రమానికి రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది. సెప్టెంబర్ 9వ తేదీన ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉంది. ఈ నేపథ్యంలో రాధాకృష్ణన్ విజయం లాంఛనప్రాయమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సంఖ్యాబలం దృష్ట్యా ఆయన ఎన్నిక ఏకపక్షంగానే జరగనుందని అంచనా వేస్తున్నారు.



## ఫలించిన తెలంగాణ ఎంపిల

# పోరాటం: తుమ్మల

### 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా ఎంపిలను అభినందించిన మంత్రి తుమ్మల

హైదరాబాద్,తెలంగాణ దిశ : రాష్ట్రంలో రైతులకు తగినంత యూరియా సరఫరా చేయాలంటూ కేంద్రంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు చేసిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. తెలంగాణ రాష్ట్రానికి 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసేందుకు కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మొత్తం ఈ వారంలో తెలంగాణకు సరఫరా చేస్తామని సదరు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దీంతో కర్ణాటక నుంచి 10,800 మెట్రిక్ టన్నుల యూరియా షిప్ మెంట్ ప్రారంభం కానుంది. ఈ వారంలో మరో మూడు షిప్‌మెంట్‌ల ద్వారా యూరియా సరఫరాకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు ఆదేశాలు జారి చేసింది.




## సమాజహితం కోసం పరితపించిన

# రతన్ టాటా

### జీవితాంతం అందుకోసం కష్టపడ్డ మహనీయుడు
### రతన్ టాటా ఆలోచనలకు సజీవ రూపం ఇన్నోవేషన్ హబ్
### రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభంల సిఎం చంద్రబాబు

అమరావతి,,తెలంగాణ దిశ : రతన్ టాటా భరత జాతి ముద్దుబిడ్డ అని, దేశం కోసం తపించిన మహానుభావుడని ఏపీ సీఎం చంద్రబాబు కొనియాడారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కలసి ప్రారంభించారు. అనంత రం చంద్రబాబు మాట్లాడుతూ..'దేశానికి ఏదైనా చేయాలని రతన్‌టాటా నిరంతరం తపించేవారని అన్నారు. సమాజసేవ కు ఆయన జీవితాంతం కృషి చేశారు. ప్రతిఒక్కరూ డబ్బు సంపాదించాలనే చూస్తారు. ఆయన మాత్రం సంపాదించిన డబ్బును సమాజానికి తిరిగిచ్చేవారు. రతన్‌టాటా ఆలోచనలు సజీవంగా ఉంచాలని ఇన్నోవేషన్ హబ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఎంటప్రెన్యూర్ రావాలనేదే నా నినాదం. గతంలో ప్రతి ఇంటి నుంచి ఒక ఐటీ- ఉద్యోగి ఉండాలని కృషి చేశాను. భవిష్యత్ అంతా ఐటీ- రంగానిదే అని గుర్తించాను. ప్రభుత్వ సరైన విధానాలు అవలంబిస్తే ఆదాయం, సంపద వస్తుందని చంద్రబాబు అన్నారు. వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు పారదర్శకంగా ప్రోత్సాహకాలు కల్పించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కీలక వేదికకానుందని మంత్రినారా లోకేశ్ అన్నారు. ఆలోచనలకు తగ్గ ఫలితాల సాధనే లక్ష్యంగా ఈ వేదిక పని చేస్తుందన్నారు. ఇందుకనుగుణంగా విద్యా వ్యవస్థ పునాదులు బలోపేతం చేసి విద్యార్థి దశ నుంచే ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు.ముం దున్న సవాళ్లకు తగ్గట్టుగానే అవకాశాల ను అందిపుచ్చుకునే కార్యాచరణతో పనిచేస్తున్నట్లు చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్రంలో పని చేస్తున్నందున దేశానికి ఏపీ ఆవిష్క రణల హబ్‌గా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.



## రేవంత్ కు పెరిగిన

# పట్టు..

### వైస్ ప్రెసిడెంట్ అభ్యర్థి ఎంపికలో కీలకం

హైదరాబాద్,తెలంగాణ దిశ : ఇండియా కూటమి నుంచి ఉపరాష్ట్రపతి ఎన్నికల పోరులో అనూహ్య పరిణామాలు చోటు చేసుకు న్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదనతో మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ వ్యక్తి అయిన జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రంగంలోకి దిగడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. కాంగ్రెస్‌లో తన మాటకు విలువ లేదని ప్రతిప క్షాలు తరచూ విమర్శలు చేసినా.. ఇండియా కూటమి అభ్యర్థిని ప్రతిపాదించి ఆమోదం తెచ్చుకో వడం ద్వారా రేవంత్ తన ప్రభా వాన్ని చాటుకున్నాడు. ఇప్పటికే ఎన్డీయే అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్, తమిళనాడుకు చెందిన సిపి రాధాకృష్ణన్ ను ఖరారు చేసింది. ఇది లాంఛనమేనని భావించిన సమయంలో ఇండియా కూటమి నుంచి తెలంగాణ అభ్యర్థి బరిలోకి రావడం పోరును రసవత్తరంగా మార్చింది.

# దేశంలో ప్రశ్నార్థకంగా మారిన ఓటు హక్కు..

- ఎన్నికల కమిషన్ రాజ్యాంగ సంస్థగా పని చేయడం లేదు
- బిజెపి, మోదీలను గద్దె దింపేందుకు ప్రజాతంత్ర లౌకిక శక్తులు ఏకం కావాలి
- ఇండియా కూటమిలో పరస్పర సహకారం, సర్దుబాటు ఉండాలి
- ఉప రాష్ట్రపతిగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి గెలిస్తే దేశ భవిష్యత్ రాజకీయాలలో తీవ్ర ప్రభావం
- సిపిఐ రాష్ట్ర 4వ మహాసభను ప్రారంభిస్తూ సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా
- గాజుల రామారంలో ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైన మహాసభలు







**కుత్బుల్లాపూర్, ఆగస్టు 20, (తెలంగాణ దిశ) :** రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కైన ఓటు హక్కు ప్రశ్నార్థకంగా మారిందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండేలా చూడడంలో భారత ఎన్నికల సంఘం రాజ్యాంగ సంస్థగా లేదా తటస్థ సంస్థగా పని చేయడం లేదని మండిపడ్డారు. అందుకే బీహార్ లో పెద్ద ఎత్తున ఉద్యమం ప్రారంభమైందన్నారు. రాజ్యాంగం, ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించబడాలంటే బిజెపి, ప్రధాని మోదీని అధికారం నుంచి దించి వేయాల్సిందేనన్నారు. అందుకు లౌకిక, ప్రజాతంత్ర పార్టీలన్నీ ఒకే వేదికపైకి వచ్చి బిజెపి, మోదీని గద్దె దించేందుకు పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్' (గాజుల రామారం)లోని 'కామ్రేడ్ ఎన్. బాలమల్లేశ్ హాల్' (మహారాజా గార్డెన్స్) లో మూడు రోజుల పాటు జరిగనున్న సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు బుధవారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ప్రారంభ సభకు సిపిఐ శ్రేణులు ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు ధరించి పెద్ద ఎత్తున హాజరయ్యారు. ప్రాంగణంతా అరుణ వర్ణం సంతరించుకుంది. మహాసభ ప్రారంభోత్సవ సభలో ముఖ్యఅతిథిగా రాజా, అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె. నారాయణ, సయ్యద్ అజీజ్ పాల్గొన్నారు. సభలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సౌహార్ద సందేశాలిచ్చారు. మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎండి. యూసుఫ్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, కె. శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెపల్లి శ్రీనివాస రావు, సిపిఐ ఎంఎల్ నెల్లికంటి సత్యం, మాజీ ఎంఎల్ పిజె. చంద్రశేఖరరావు, సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, కవి, రచయిత ఏటుకూరి ప్రసాద్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, కళవేన శంకర్, ఎం. బాల నరసింహా, విఎస్.బోస్, ఈటి. నరసింహా, ప్రముఖ సినీ నటుడు డాక్టర్ మాదాల రవి, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డిజి. సాయిల్ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఇ. ఉమా మహేశ్ తదితరులు ఆసీనులయ్యారు. సభలో డి. రాజా ప్రసంగిస్తూ దేశం ప్రస్తుతం అత్యంత సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. ప్రాథమిక హక్కులు, పౌరుల హక్కుగా ఉన్న ఓటు హక్కు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. బిజెపి, ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన అనంతరం రాజ్యాంగంపై దాడి పెరిగిందన్నారు. పార్లమెంట్ పని చేయనివ్వడంలేదని, అది పని చేయకపోతే ప్రజాస్వామ్యం అంతమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం విధ్వంసం అవుతుందని హెచ్చరించారు. అర్హులైన ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల కమిషన్ ఉండగా, బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ పేరుతో పాలకులకు ఇష్టం లేని ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించే కార్యక్రమం చేస్తున్నారని విమర్శించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న తమిళనాడు, కేరళ, బెంగాల్ రాష్ట్రాలలో ఎన్నికల కమిషన్ ఎలా పని చేస్తుందనేది పెద్ద సమస్యగా మారిందని అన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కును కల్పించేందుకు రాజ్యాంగ బద్ధమైన ఎన్నికల కమిషన్ అధికారాలు ఉన్నాయని, కానీ ప్రస్తుతం ఆ సంస్థ రాజ్యాంగ బద్ధమైన సంస్థగా పని చేయడం లేదని విమర్శించారు. ఎన్నికల కమిషన్ అర్హులైన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించాలని సిపిఐ డిమాండ్ చేస్తున్నదని అన్నారు. అర్హులైన వారు తమ ఓటు హక్కును కోల్పోతున్నారని, ప్రజాస్వామ్యం ఎక్కడ అమలు జరుగుతున్నదని నిలదీశారు. బీహార్ ఎస్ నిలుపుదల చేయాలని సుప్రీం కోర్టులో సిపిఐ తరపున స్వయంగా తాను పిటిషన్ దాఖలు చేసినట్టు రాజా వెల్లడించారు. భారత్ హిందూత్వ దేశం, మతతత్వ రాజ్యాంగా మారితే దేశానికే పెద్ద విపత్తుగా పరిణమిల్లుతుందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఏనాడో హెచ్చరించారని అన్నారు. భారతదేశాన్ని కాపాడాలంటే బిజెపికి వ్యతిరేకంగా, ఆర్ కు వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అందుకే ఇండియా కూటమి ఏర్పాటైందని, దాని ఏర్పాటులో సిపిఐ కీలక పాత్ర పోషించిందని రాజా తెలిపారు. ఇండియా కూటమిలో భాగస్వాములు కూడా పరస్పర సహకారం, సర్దుబాటు అవసరమని సూచించారు.

**ఓటు హక్కును 18 ఏండ్లకే సవరించిన ఘనత సిపిఐదే**

ఇటీవలనే దేశ స్వాతంత్ర్య దినోత్సవం జరిగిందని, స్వాతంత్ర్యం రాకముందు భారతదేశం బ్రిటీష్, ఫ్రెంచ్, పోర్చుగీస్ వలస పాలనలో ఉండేదని, అప్పట్లో ఎన్నికలు జరిగాయని, కానీ ఓటు హక్కు అందరికీ ఉండేది కాదని, సంపన్నులు, ఉన్నతస్థాయి వ్యక్తులకు మాత్రమే ఓటు హక్కు ఉండేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే భారతదేశంలో 21 ఏళ్లు దాటిన పౌరులందరికీ కుల, మత, ప్రాంత, స్త్రీ, పురుష బేధం లేకుండా వయోజన ఓటు హక్కును రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కల్పించారని తెలిపారు. సిపిఐ నేత సికె.చంద్రప్పన్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో వయోజన ఓటు వయస్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించాలని పార్లమెంట్ ప్రస్తావించగా, నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అంగీకరించడంతో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కుల, మత, ప్రాంతం అనే తేడాలు లేకుండా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారన్నారు. భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే వయోజనులైన పురుషులతో సమానంగా మహిళలకు కూడా ఒకే సమయంలో ఓటు హక్కు లభించిందన్నారు. కానీ అమెరికా, యురోపియన్ దేశాల్లో చాలా కాలం పురుషులకు మాత్రమే ఓటు హక్కు ఉండేదని, అనేక పోరాటాలు తరువాతనే మహిళలకు ఓటు హక్కు దక్కిందన్నారు. భారతదేశంలో అత్యంత ధనికులైన అదానీ, అంబానీ ఓటుకు, సామాన్య ప్రజల ఓటుకు ఒకే విలువ ఉంటుందని, అది అంబేద్కర్ గొప్పతనమని చెప్పారు. అదే విధంగా ఓటుతో పాటు ప్రతి మనిషికి ఒకే విలువ ఉండే సమాజం కావాలని ఆయన ఆకాంక్షించారని గుర్తు చేశారు.

**ఉప రాష్ట్రపతి ఎన్నిక రాజకీయ యుద్ధం**

ఉప రాష్ట్రపతి ఎన్నికలు దేశ చరిత్రలో ఎంతో కీలకమని, ఈ ఎన్నిక రాజకీయ యుద్ధమని రాజా అన్నారు. దేశ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఎందుకు రాజీనామా చేశారని ఆయన ప్రశ్నించారు. జగదీప్ ధన్కర్ రాజీనామాకు ఆయన అనారోగ్యం కారణం కాదని, రాజకీయ కారణం ఉన్నదని, అదేమిటో ఇప్పటికీ ఎవరికీ తెలియదన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని ప్రకటించామని, సిపిఐ కూడా మద్దతు ప్రకటించిందని, లౌకిక పార్టీలు అన్నీ జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉప రాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుపొందితే దేశ భవిష్యత్ రాజకీయాలలో తీవ్ర ప్రభావం చూపుతుందని, చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని రాజా తెలిపారు.

**ఎన్నికల్లో సిపిఐ బలం పెరగాలి**

కార్మికులు, రైతులు, మహిళలు, కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం



చేయాలని రాజా పిలుపు నిచ్చారు. తెలంగాణలో సిపిఐ అత్యంత బలమైన పార్టీ అని, ప్రస్తుతం ఒక్క ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను మరింత ఎలుగెత్తి చాటేందుకు పార్లమెంటు, అసెంబ్లీ, ప్రతి ప్రజా ప్రాతినిధ్య ఎన్నికల్లో సిపిఐ బలం పెరగాలని ఉద్ఘాటించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో ముఖ్య పాత్ర పోషించిన ఘన చరిత్ర సిపిఐదని గుర్తు చేశారు.

**వీర తెలంగాణ గడ్డపై మతోన్మాద బిజెపిని అడ్డుకునే శక్తి వామపక్షాలకే ఉంది.. కందిమళ్ల ప్రతాపరెడ్డి**

వీర తెలంగాణ గడ్డపై మతోన్మాద బిజెపి అధికారంలోకి రాకుండా అడ్డుకునే శక్తి కేవలం వామపక్ష పార్టీలకే ఉందని, ఇందుకు అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాలని సిపిఐ సీనియర్ నాయకులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాపరెడ్డి పిలుపు నిచ్చారు. సిపిఐ వందేళ్ల ప్రస్థానంలో చేసిన పోరాటాలు, త్యాగాలు సాధించిన విజయాలను మననం చేసుకుంటున్నామన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సిపిఐ పోరాటాలు నిర్వహించిందని, మాతృదేశం కోసం నాయకులు ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. 1942 వరకు భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్నా, రైతులు, కూలీలు, విద్యార్థులు, యువకులను సంఘటితం చేసి స్వాతంత్ర్య పోరాటంలో కదిలించిందని వివరించారు. స్వాతంత్ర్య సమరంలో ముందుండి పోరాటం చేసిన కమ్యూనిస్టు పార్టీ నాయకులు జైలు శిక్ష అనుభవించారన్నారు. నిరంకుశ నిజాంకు వ్యతిరేకంగా మట్టి మనుషులతో బంధూకులు పట్టించి సాయుధ సమరాన్ని నడిపిన చరిత్ర సిపిఐదన్నారు. కమ్యూనిస్టు పార్టీ చీలికతో కొంత బలహీనమైందని, దీనిని అధిగమించేందుకు దేశంలోని కమ్యూనిస్టు పార్టీలు, మేధావులను ఏకం చేసేందుకు కీలకపాత్ర పోషించాలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజాను ఆయన కోరారు. రాజకీయాలు వ్యాపారంగా మారాయని, తెలంగాణ విప్లవ గడ్డపై కమ్యూనిస్టులుగా కమ్యూనిస్టుల పాత్ర ఏమిటనేది మహాసభలో ఆత్మ పరిశోధన చేసుకోవాలని సూచించారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను మరుగున పడేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే స్ఫూర్తి అని, అయితే మాజీ సిఎం కెసిఆర్ తానే ఒక వీరునిగా చెప్పుకుంటున్నారని, సాయుధ పోరాటాన్ని తామే నడిపించినట్టు చరిత్రను బిజెపి వక్రీకరిస్తున్నారన్నారు. కమ్యూనిస్టులందరి ఆశయం ఒక్కటేనని, ఐక్యత తమ ఆయుధమని, ఈ ప్రజాతంత్ర ఐక్యత ద్వారా కమ్యూనిస్టు స్ఫూర్తిని, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు.

**అమర వీరుల త్యాగం, రక్తంతో ఎరుపెక్కిందే ఎర్ర జెండా : ఏటుకూరి ప్రసాద్**

అమర రవీరుల త్యాగం, రక్తంతో ఎరుపెక్కిన జెండా ఎర్రజెండా అని, నిజాంకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటంలో ఎందరో అమరులైన వారి వారసత్వం బాట ఎర్రబాట అని ఏటుకూరి ప్రసాద్ అన్నారు. ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నాటి దశలో ఉన్న రాజకీయ పరిస్థితులే ప్రస్తుతం దేశంలో ఉండడంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఫాసిజం మళ్లీ విజృంభిస్తుందన్నారు.

గతంలో కమ్యూనిస్టులు రక్తార్పణతో ఏ ఆశయాలు, ఆదర్శాలతో ముందుకు వెళ్లారో ఆ ఆశయాల స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఫాసిజం ఎన్నో రకాల ముసుగు ధరించి చిన్నల నుంచి పెద్దల వరకు అనేక రూపాల్లో బయట పడడం ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమన్నారు. ఈ పరిస్థితులు ఎదుర్కొనే శక్తి కేవలం వామపక్షాలకు మాత్రమే ఉందన్నారు. ఈ దశలో అమరవీరుల ఆశయాల స్ఫూర్తితో వామపక్షాలన్నీ ఐక్యంగా ముందుకు కదిలి ఫాసిస్టు శక్తులను ఓడించేందుకు ప్రతిజ్ఞ చేయాల్సి అవసరముందన్నారు.

**సాంస్కృతిక విప్లవం రావాలి :**

**సినీ నటులు మాదాల రవి**

కమ్యూనిస్టు శక్తులన్నీ ఏకమై పోరాటం చేసినప్పుడే సామాన్యుడి గుండె ప్రతి ధ్వనిస్తుందని, కుల్లుతున్న వ్యవస్థను కూకటి వేళ్లతో పీకేస్తారని సినీ నటులు మాదాల రవి అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాంస్కృతిక విప్లవం రావాల్సిన అవసరం ఉన్నదన్నారు. మతతత్వ శక్తులను ఎదుర్కొవాలంటే డబ్బులు ప్రధానంగా మారిన ఎన్నికల వ్యవస్థపై అందరూ కలిసి పోరాటం చేయాలన్నారు. కళ కాసుల కోసం కాదని, సామాన్యులలో చైతన్యం తీసుకురావడం కోసమని, ప్రజా కళాకారులందరూ ప్రజలను చైతన్య వంతులను చేసినప్పుడే ప్రజలలో చైతన్యం వస్తుందన్నారు. మానవ సంబంధాలను మట్టి కరిపించే విధంగా ప్రస్తుత సినిమాలు, సీరియల్స్ ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్రమల్లెలు లాంటి సినిమాలు తీసిన మాదాల రంగారావు కూడా కమ్యూనిస్టు పార్టీ తయారు చేసిన ఆయుధం అన్నారు.

**ఎర్ర జెండాలతో ఆకట్టుకున్న ర్యాలీ**

కుత్బుల్లాపూర్ గాజుల రామారంలో సిపిఐ రాష్ట్ర మహాసభలు బుధవారం ప్రారంభమయ్యాయి. షాపూర్ నగర్ గాజుల రామారం చౌరస్తా నుంచి మహారాజ గార్డెన్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సుమారు మూడు కిలోమీటర్లు సాగిన ర్యాలీలో పార్టీ జాతీయ కార్యదర్శి డి. రాజా, మాజీ ఎంపీ అజీజ్ పాషా, చాడ వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి. ఈటి నర్సింహా, పశ్య పద్మ పల్లా వెంకట్ రెడ్డి, విఎస్ బోస్, తక్కెళ్ళపల్లి శ్రీనివాస్, సినీ నటులు మాదల రవి, బాలనర్సింహా పాల్గొన్నారు.





# మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్కూలు విద్యార్థులకు శానిటరీ న్యాప్ కిన్ల పంపిణీ







**కుత్బుల్లాపూర్, ఆగస్టు 20, (తెలంగాణ దిశ) :** మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం సూరారం డివిజన్ షాపూర్ నగర్ లోని జిల్లా పరిషత్ హైస్కూల్ లో విద్యార్థులకు శానిటరీ న్యాప్ కిన్ లు పంపిణీ చేశారు. భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం, బాలికల రక్షణ దృష్ట్యా ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్ల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు, పిల్లలు సురక్షితంగా ఉండడం, క్యాన్సర్, రీప్రొడక్టివ్ సమస్యలను నివారించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆమె వివరించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో, మురికి వాడలలో శానిటరీ న్యాప్ కిన్లను పంపిణీ చేస్తామని తెలిపారు. మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కలంబ, రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతా రావుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన మేడ్చల్ జిల్లాకు శానిటరీ న్యాప్ కిన్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రాబోయే ఒక సంవత్సరం పాటు ప్రతి నెలా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శానిటరీ న్యాప్ కిన్లను పంపిణీ, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలారెడ్డి, అంజలి యాదవ్, ప్రధాన కార్యదర్శి గోవిందమ్మ జ్యోతి, జిల్లా కార్యదర్శి శోభరాణి, జిల్లా కార్యదర్శి కోటేశ్వరి, కుత్బుల్లాపూర్ అధ్యక్షురాలు రేణుక రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షురాలు సొంటిరెడ్డి చైతన్యరెడ్డి, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, దుండిగల్ మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు ఖనీస్ ఫాతిమా, కుత్బుల్లాపూర్ బ్లాక్ కార్యదర్శి మాధవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జాజాల అర్చన, 126 డివిజన్ మహిళా అధ్యక్షురాలు లత, 128 డివిజన్ మహిళా అధ్యక్షురాలు కమల, 130 డివిజన్ మహిళా అధ్యక్షురాలు తులసి, 132 డివిజన్ మహిళా అధ్యక్షురాలు సుజాత యాదవ్, సరస్వతి, నారాయణమ్మ, స్వాతి, కమల తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## భారతం...చాణుక్య వ్యూహం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 50% టారిఫ్‌లు విధించాడు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిషేధించాలని ఒత్తిడి చేయడం ద్వారా భారత్‌ను శత్రు దేశంగా చూస్తున్నారనే సంకేతాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్ తన సంప్రదాయ బహుముఖ విదేశాంగ విధానాన్ని ఉపయోగిస్తూ, రష్యా, చైనాలతో సంబంధాలను బలోపేతం చేస్తోంది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ రష్యా పర్యటన, ఆగస్టు 31న ప్రధాని నరేంద్ర మోదీ చైనా సందర్శన, కేంద్ర మంత్రులు జైశంకర్, రాజ్‌నాథ్ సింగ్‌ల ఇటీవలి చైనా పర్యటనలు ఈ వ్యూహాత్మక దృక్పథాన్ని సూచిస్తున్నాయి. పంచతంత్ర నీతి ప్రకారం భారత్ అమెరికా శత్రుదేశాలను ఏకం చేస్తోంది.ట్రంప్ భారత్‌పై 50% టారిఫ్‌లు విధించడం, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపాలని ఒత్తిడి చేయడం ద్వారా భారత్?అమెరికా సంబంధాలు గణనీయమైన సవాలును ఎదుర్కొంటున్నాయి. భారత్ రష్యా చమురు కొనుగోళ్లు ఉక్రెయిన్ యుద్ధానికి ఆర్థిక సహాయం చేస్తున్నాయని ట్రంప్ ఆరోపించారు. అయితే, భారత్ ఈ ఆరోపణలను "అన్యాయమైనవి, అసమంజసమైనవి" అని తిరస్కరించింది, రష్యా చమురు కొనుగోళ్లు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం కాదని, ఇది జాతీయ ఇంధన భద్రతకు కీలకమని స్పష్టం చేసింది. 2024లో భారత్?అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 190 బిలియన్లు కాగా, ఈ టారిఫ్‌లు 64 బిలియన్ల ఎగుమతులను ప్రభావితం చేయవచ్చని అంచనాఇదిలా ఉంటే ట్రంప్ బ్రిక్స్ దేశాలను (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా) "యాంటీ?అమెరికన్" బ్లాక్‌గా భావిస్తున్నారు, ఇది డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిక్స్ సభ్య దేశాలపై అదనంగా 10% టారిఫ్‌లు విధించాలనే ట్రంప్ బెదిరింపు, భారత్‌ను రష్యా, చైనాలతో మరింత చేరువ చేసే అవకాశం ఉంది. ఈ ఒత్తిడి భారత్‌ను తన బహుముఖ విదేశాంగ విధానాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రేరేపిస్తోంది.భారత్?రష్యా సంబంధాలు "సమయ పరీక్షిత, విశ్వసనీయ" భాగస్వామ్యంగా కొనసాగుతున్నాయి. 2023?24 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం 65.7 బిలియన్ డాలర్లకు చేరింది, ఇందులో రష్యా నుంచి 61.44 బిలియన్ డాలర్ల దిగుమతులు (ప్రధానంగా చమురు) ఉన్నాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ రష్యా పర్యటన, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది చివరలో భారత్ సందర్శనకు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ సందర్శనలో ట్రంప్ టారిఫ్‌లు, రష్యా?ఇండియా?చైనా (ఆర్ఐసీ) త్రికోణ సహకారం ప్రధాన అంశాలుగా ఉంటాయని భావిస్తున్నారు. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగించడం ద్వారా జాతీయ ఇంధన భద్రతను కాపాడుకుంటోంది, ఇది ట్రంప్ ఒత్తిడిని ఎదుర్కొనే వ్యూహంగా కనిపిస్తోంది.2020 గల్వాన్ ఘర్షణ తర్వాత భారత్?చైనా సంబంధాలు ఒడిదొడుకులను ఎదుర్కొన్నప్పటికీ, ఇటీవలి కాలంలో సాధారణీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. 2024 అక్టోబర్‌లో కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సమావేశమై, సరిహద్దు సమస్యలపై చర్చించేందుకు ప్రత్యేక ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు 31న మోదీ చైనాలోని టియాంజిన్‌లో జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) సదస్సుకు హాజరవుతారు, ఇది ఏడేళ్లలో ఆయన తొలి చైనా సందర్శన. ఈ సందర్శనలో ట్రంప్ టారిఫ్‌లు, ద్వైపాక్షిక వాణిజ్యం, సరిహద్దు సమస్యలు ప్రధాన అంశాలుగా ఉంటాయి. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఆగస్టు 18న భారత్ సందర్శనలో ధోవల్‌తో సరిహద్దు సమస్యలపై చర్చిస్తారని తెలుస్తోంది.బ్రిక్స్ దేశాలు (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా) గ్లోబల్ సౌత్ దేశాలకు ప్రత్యామ్నాయ ఆర్థిక, రాజకీయ వేదికగా ఉద్భవించాయి. ట్రంప్ బ్రిక్స్‌ను యాంటీ?అమెరికన్ బ్లాక్‌గా ఆరోపిస్తున్నప్పటికీ, భారత్ ఈ సమూహంలో తన పాత్రను బలోపేతం చేస్తోంది. బ్రిక్స్ దేశాలు డాలర్ ఆధిపత్యానికి ప్రత్యామ్నాయ కరెన్సీలపై చర్చిస్తున్నాయనే ట్రంప్ ఆందోళన, భారత్‌ను ఈ సమూహంలో మరింత చురుకుగా పాల్గొనేలా ప్రేరేపిస్తోంది. అయితే, భారత్ బ్రిక్స్ కరెన్సీ ఆలోచనను ప్రత్యక్షంగా సమర్థించలేదు, దాని బహుముఖ విధానాన్ని కొనసాగిస్తోంది.రష్యా?ఇండియా?చైనా (ఆర్ఐసీ) త్రికోణం 1990లలో స్థాపించబడినప్పటికీ, ఇటీవలి ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో దీని పునరుజ్జీవనం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ మూడు దేశాలు అమెరికా ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి, ఇది వాటిని ఒకదానికొకటి చేరువ చేస్తోంది. మోదీ, పుతిన్, జిన్‌పింగ్ సమావేశం ఎస్‌సీవో సదస్సులో జరిగితే, అమెరికా దూకుడు విధానాలకు చెక్ పెట్టే వ్యూహాత్మక సహకారం ఏర్పడవచ్చు. ఈ త్రికోణం భారత్‌కు రష్యా, చైనాలతో వాణిజ్య, భద్రతా సహకారాన్ని బలోపేతం చేసే అవకాశాన్ని ఇస్తుంది, అదే సమయంలో అమెరికాతో సంబంధాలను సమతుల్యం చేస్తుంది.భారత్ తన "నాన్?అలైన్‌మెంట్" విధానాన్ని కొనసాగిస్తూ, అమెరికా, రష్యా, చైనాలతో సంబంధాలను సమతుల్యం చేస్తోంది. ట్రంప్ ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపలేదు, ఇది జాతీయ ఆర్థిక, ఇంధన భద్రతకు కీలకమని పేర్కొంది. ప్రధాని మోదీ రైతులు, చేపల వేటగాళ్లు, డైరీ రైతుల ప్రయోజనాలను రాజీ పడనని స్పష్టం చేశారు, ఇది అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయ రంగంపై ఒత్తిడిని తిరస్కరించే సంకేతం. ఈ విధానం భారత్ యొక్క స్వాతంత్ర్య దృక్పథాన్ని, జాతీయ ప్రయోజనాలను ప్రతిబింబిస్తుంది.ట్రంప్ టారిఫ్‌లు, భారత్ రష్యా చైనా సహకారం అమెరికాను ఆందోళనకు గురిచేస్తోంది. భారత్ యొక్క ఎస్‌సీవో, బ్రిక్స్ సదస్సులలో చురుకైన పాత్ర, ఎస్‌సీవో త్రికోణం యొక్క పునరుజ్జీవనం అమెరికా యొక్క ఏకపక్ష విధానా లకు సవాలుగా మారవచ్చు. మాజీ యూఎస్ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ జాన్ బోల్టన్ హెచ్చరించినట్లు, ట్రంప్ టారిఫ్‌లు భారత్‌ను రష్యా, చైనాలతో మరింత చేరువ చేయవచ్చు,

# బాచుపల్లిలో ఘోరం...: కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలను సంపులో వేసి చంపి తాను ఆత్మహత్యకు ప్రయత్నించిన ఇల్లాలు



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 20, (తెలంగాణ దిశ) :**భార్యాభర్తల మధ్య చెలరేగిన కుటుంబ కలహాలతో తీవ్ర మనస్థాపానికి గురైన భార్య ఇద్దరు చిన్న పిల్లలను నీటి సంపులో వేసి చంపి తాను అందులో దూకి ఆత్మహత్యా ప్రయత్నం చేసి ఆసుపత్రి పాలైంది. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం కామారెడ్డి జిల్లా పిట్లంకు చెందిన లక్ష్మణ్, రత్నమ్మ దంపతులు. వీరికి నలుగురు సంతానం. జగన్ (08), పవన్ (07), అరుణ్ (03), సుభాన్ 8 నెలలు. అయితే లక్ష్మణ్ రత్నమ్మ దంపతులు ఉపాధి కొరకు బాచుపల్లిలో నివసిస్తున్నారు. వీళ్ళ కుమారులు జగన్, పవన్ లను సొంత ఊరిలోనే ఉంచి చిన్నవారైనా అరుణ్, సుభాన్ లను తమ వద్ద ఉంచుకున్నారు. గత కొంత కాలంగా దంపతులు ఇద్దరి మధ్య కుటుంబ నియంత్రణ, ఇతర ఆర్థిక విషయాలలో తీవ్రమైన విభేదాలు ఏర్పడ్డాయి. దీంతో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేది. బుధవారం తెల్లవారుజామున ఇదే విషయమై భార్యా భర్తలిద్దరూ గొడవపడ్డారు. అనంతరం లక్ష్మణ్ బయటికి వెళ్లి.పోవడంతో రత్నమ్మ తీవ్ర మనోవేదనకు గురై, జీవితంపై విరక్తి చెంది తన కుమారులైన అరుణ్ (03), 8 నెలల వయసున్న సుబాన్లను తాను ఉంటున్న అద్దె ఇంట్లోనే నీటి సంపులోకి తోసివేసి చంపేసింది. అనంతరం తాను ఆత్మహత్య చేసుకోవడానికి అదే సంపులోకి దూకింది. ఆ సమయంలో పక్కింటి వ్యక్తి కాల కృత్యాల కోసం నిద్రలేచి ఏదో గట్టి చప్పుడు వినిపించడంతో రత్నమ్మ నివసిస్తున్న ఇంట్లోకి చూశాడు. దీంతో ఆయనకు పరిస్థితి అర్థమై చుట్టుపక్కల వారిని నిద్రలేపి వారి సహకారంతో సంపులోకి దూకిన రత్నమ్మను మొదటగా బయటికి తీశారు. అనంతరం చిన్న పిల్లలిద్దరినీ అరుణ్ సుభాన్లను కూడా నీటి సంపు నుండి బయటికి తీశారు. అయితే చిన్న పిల్లలు ఇద్దరు అప్పటికే చనిపోయారు. రత్నమ్మ మాత్రం స్థానికులు సపర్యాలు చేయడంతో ప్రమాదం తప్పింది. జరిగిన ఘటనలో క్షణికావేశానికి గురై తన ఇద్దరు చిన్న పిల్లలను తల్లి చంపుకోవడం స్థానికంగా విషాదం నెలకొంది. స్థానికుల ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు సంఘటన స్థలంలో వివరాలను సేకరించారు. రత్నమ్మను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సంఘటనలో చనిపోయిన బాలలు అరుణ్, సుభాన్ ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఏఎస్ రావునగర్ లో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు






**ఏఎస్ రావునగర్, ఆగస్టు 20, (తెలంగాణ దిశ) :**భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని రాధికా చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, అల్లురయ్య, పాకాల రాజు భూపాల్ రెడ్డి అజీజ్, లింగస్వామి, పాత కోటి రామలింగం, భద్రగామ నరసింహ, తాళ్లపల్లి సందీప్ గౌడ్, సింగమ్ కిరణ్, సాహెబ్, ఎస్ ఎన్ రావు, సలీమ్, రహమతుల్లా, ఎస్ఎం. పిరా, దస్తగిరి, బాల్ నర్సింహ, ఖాసీం వాలీ, సుభానీ, మహబూబు, ఖాన్, అల్లా బక్షి, ఎస్ఏ. సత్తర్, రహమతుల్లా ఖాన్, హుస్సేన్ వాలీ, జానీ, సంజీవరెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు భవాని, సునీత, రాణి, మాధవి, సంధ్య, రాధా, లక్ష్మి భాగ్య, విజయలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బాచుపల్లిలో నడిరోడ్డుపై బిజెపి ఆందోళన



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 20, (తెలంగాణ దిశ) :**బాచుపల్లి 17వ డివిజన్ లోని కౌసల్య కాలనీ వద్ద గత 15 రోజులుగా రోడ్డు మరమ్మతుల కోసం తవ్విన గుంతల కారణంగా స్థానికులు అవస్థలు పడుతున్నారని నిరసిస్తూ బిజెపి ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. బిజెపి బాచుపల్లి అధ్యక్షుడు ప్రసాద్ రాజు మాట్లాడుతూ హెచ్ఆర్ సి లో తాము ఫిర్యాదు చేయగా కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు త్వరలోనే రోడ్లు తవ్విన ప్రదేశంలో తిరిగి రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వర్షాకాలం వచ్చినా ఆ పని పూర్తి చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పాలవుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కల్పించుకొని కౌసల్య కాలనీ లో తవ్విన రోడ్లలో తిరిగి రోడ్డు మరమ్మతులు చేపట్టి స్థానికులకు ఇబ్బందులు లేకుండా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు నారాయణమూర్తి, గజ్జెల్లి సంతోష్ కుమార్, సురేష్, ఉదయ్, విజయ్, విజ్ఞాన్ రెడ్డి, ప్రహ్లాద్, కాసాని సంతోష్, సాయి కృష్ణారెడ్డి, కాశి, వినీత్, ఐలయ్య తదితరులు ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి ఉద్ధృతి





**భద్రాద్రి కొత్తగూడెం, -ఆగస్టు 20, (తెలంగాణ దిశ)** :గత పది రోజుల కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా భద్రాచలం వద్ద గోదావరమ్మ ఉగ్రరూపం దాల్చింది. ఎగువ ప్రాంతాల్లో ఉన్న వాగులు వంకలు ఉప్పొంగడంతో గోదావరిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది దీంతో భద్రాచలం వద్ద బుధవారం ఉదయం 8 గంటలకు 43 అడుగులకు చేరుకోవడంతో అధికారులు మొదటి ప్రమాదక హెచ్చరికను చేశారు. సోమవారం రాత్రి క్రమేపి 39 అడుగుల వరకు వచ్చి మంగళవారం అర్ధరాత్రి నుంచి 36 అడుగులకు తగ్గింది శాంతించిన గోదారమ్మ బుధవారం 43 అడుగులు చేరింది.. అంటే ఒక్కసారిగా 8 అడుగులకు పైగా ఉత్తిరిత ప్రభావం పెరిగింది.. బుధవారం సాయంత్రం 6 గంటలకు 46.6 అడుగులకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. 10,48,490 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదలవుతుంది. గురువారం అర్ధరాత్రి 48 అడుగుల రావటంతో రెండవ ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు గురువారం వరకు 50 అడుగుల వరకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. లోతట్టు ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. మమ్ము ప్రాంతంలో ఉన్న ప్రజలందరూ అధికారులకు సహకరించాలని కోరారు. వ్యవసాయం నిమిత్తం పంట పొలాలకు వెళ్లే రైతులు వాగులు దాటుకుంటూ వెళ్లకూడదని, అదేవిధంగా మత్స్యకారులు ఎవరైనా గాని గోదావరి వద్దకు వెళ్ళద్దని హెచ్చరించారు.

# కాలనీ సంక్షేమ సంఘాలతోనే అభివృద్ధి సాధ్యం

- కోలన్ హన్మంత్ రెడ్డి





**కుత్బుల్లాపూర్, ఆగస్టు 20, (తెలంగాణ దిశ) :**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 డివిజన్ అపురూప కాలనీ గార్డెనియా అపార్ట్ మెంట్ మోడీ బిల్డర్స్ వారు నూతన ఎబీసీ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డిని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షులు కె. ధనుంజయ, ప్రధాన కార్యదర్శి డి. చంద్రయ్య రెడ్డి, కోశాధికారి జేసీ. రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వి. శైలజ, కమిటీ సభ్యులు బి. వెంకట్, కులకర్ణి, ఎస్ఎం. ఝా, ఎజి ఉదయన్, గణేష్.లో ఆయనను కలిసి కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను హన్మంత్ రెడ్డి ఘనంగా సన్మానించారు. సంక్షేమ సంఘాలతోనే కాలనీల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కాలనీలో ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు , డివిజన్ అధ్యక్షులు సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, హరికిరణ్ పటేల్, చందు, కరణ్, సిద్ధనోళ్ళ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముంపు సహాయక చర్యల్లో కార్యకర్తలు పాల్గొనాలి : సిపిఎం



**భద్రాచలం, ఆగస్టు 20, (తెలంగాణ దిశ) :** గత కొద్ది రోజులుగా ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా భద్రాచలంలో గోదావరి వరద ఉధృతి పెరుగుతున్నందున గోదావరి ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముంపు ప్రాంతాలలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి విజ్ఞప్తి చేశారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నదిలోకి వరద తీవ్రత పెరిగిందని, రెండవ ప్రమాద హెచ్చరికకు చేరువలో ఉన్నందున గోదావరి ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు గోదావరి వరద వివరాలను ప్రజలకు తెలియజేస్తూ పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ, ముంపు వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. గోదావరి కరకట్ట స్లూయిస్ వద్ద ఇరిగేషన్ అధికారులు కేంద్రీకరించి పనిచేయాలని స్వామి సూచించారు. గోదావరి వరద పెరిగే కొద్దీ రహదారులు మూతపడి రాకపోకలు బంద్ అయ్యే అవకాశం ఉన్నందున నిత్యవసర వస్తువులన్నీ అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సిపిఎం కార్యకర్తలు అందరూ ముంపు ప్రాంతాలలోని ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలలో పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ-2025 అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



జిల్లాలోని అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు సెప్టెంబర్ 5 తేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారిని ఐ. విజయ కుమారి తెలిపారు. ఇందు కోసం జిల్లాల్లో అర్హులైన ఉపాధ్యాయులు ఈ నెల 26లోపు డీఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితిలో అనుమతించమని తెలిపారు.

(మేడ్చల్ కలెక్టరేట్, తెలంగాణ దిశ)

# 29 మంది మావోయిస్టుల లొంగుబాటు



**భద్రాద్రి కొత్తగూడెం, -ఆగస్టు 20, (తెలంగాణ దిశ) :**ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో 8 మంది, దంతివాడలో 21 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పద ముగ్గురుకి రూ. 25 లక్షల 50 వేల రివార్డు ప్రకటించారు. అబూజ్ మాడ్ లో కమాండర్ డాక్టర్ శుక్లాల్ తో సహా అబుజ్ మడ్ లో కుతుల్ ప్రాంతంలో కీలకంగా చురుకుగా పని చేస్తున్న 8 మంది మావోయిస్టులు బుధవారం లొంగి పోయారు. నారాయణపూర్ ఎస్పి రాబిన్సన్ గుడియా నందు ఇద్దరు మహిళలతో సహా 8 మంది లొంగి పోయారు. ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వం ఒకవైపు లొంగుబాటు చర్యలు, మరో వైపు భద్రతా బలగాల గాలింపు చర్యలకు తట్టుకోలేక, ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టులకు కల్పిస్తున్న పునరావాస చర్యలకు ఆకర్షితులై మావోయిస్టులు లొంగిపోతున్నారని ఎస్ పి రాబిన్సన్ అన్నారు. వీరిపై 30 లక్షల రివార్డు ఉందని తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులు కుతుల్ ప్రాంతంలో చురుకుగా పని చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజాపూర్, నారాయణపూర్, దంతివాడ, కంకేర్ తదితర జిల్లా పోలీసు ఉన్నాతాధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ చిత్ర పటంలో హైదరాబాద్ నగరం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి






**శేరిలింగంపల్లి, ఆగస్టు 20, (తెలంగాణ దిశ) :** ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను సంపూర్ణంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచంతో పోటీ పడే విధంగా ప్రభుత్వ కార్యాలయాలు రూపుదిద్దుకోవాలని చెప్పారు. గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్ మెంట్ (టిఎఎల్ఐఎం) సమీపంలో రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ భవనంతో పాటు సమీకృత సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయాలకు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భవన సముదాయాల నిర్మాణ సామగ్రిని పరిశీలించారు. అనంతరం 'ప్రజా పాలన %–% ప్రగతి బాట' సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల ప్రక్షాళన, మూసీ పునరుజ్జీవం, మధ్య తరగతి ప్రజలకు రాజీవ్ స్వగృహ గృహ నిర్మాణం, నైట్ ఎకానమిని పెంచుతూ విశ్వ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడానికి సంబంధించిన ప్రణాళికలను సమగ్రంగా వివరించారు. "ప్రభుత్వ కార్యాలయాలు ముఖ్యంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని అన్నారు. హైదరాబాద్‌లో పెద్ద పెద్ద ఐటీ కంపెనీలున్నా ప్రభుత్వ కార్యాలయాలు సరిగా లేవన్నారు. ఏటా రూ. 15 వేల కోట్ల ఆదాయం సమకూర్చే స్టాంపులు – రిజిస్ట్రేషన్ శాఖకు ప్రజలు కోట్ల రూపాయల పన్నులు చెల్లిస్తున్నారని అన్నారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుతున్న వారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వస్తే వారిని ఏదో తప్పు చేసిన దోషుల్లా చూసే పరిస్థితి ఉందన్నారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ఎలాంటి సదుపాయాలు లేవన్నారు. రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సంవత్సరానికి 19 లక్షల డాక్యుమెంట్లు చేస్తున్నారని, ఈ కార్యాలయాల్లో వసతులు పెంచడం వల్ల ప్రభుత్వానికి ఆదాయమే కాకుండా గౌరవం కూడా పెరుగుతుందన్నారు. ప్రపంచంతో పోటీ పడే విధంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రభుత్వ కార్యాలయాలు రూపుదిద్దుకోవాలని అన్నారు. గచ్చిబౌలిలో 3 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వచ్చే రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కార్యాలయాలాల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించి గంటల కొద్ది నిరీక్షించే పని లేకుండా టైమ్ స్లాట్ ప్రకారం పనులు ప్రజలకు పనులు పూర్తి కావాలన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద అపర్ణ గ్రూప్ రూ. 30 కోట్ల వెచ్చించి ఈ కార్యాలయం నిర్మాణానికి ముందుకు రావడం పట్ల సంస్థ ఎండీ ఉదయ్ కు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. మిగతా కార్యాలయాలను కూడా ఇదే స్ఫూర్తితో మంత్రులు చొరవ తీసుకుని పూర్తయ్యేలా చూడాలన్నారు. వచ్చే పదేళ్లలో ప్రపంచమంతా హైదరాబాద్ నగరాన్ని చూడటానికి వచ్చే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. గత పాలకులు కొంత పరిమితితో కూడిన దృక్పథంతో ముందుకు వెళ్లారని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మనం విశాల దృక్పథంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో అభివృద్ధిని అడ్డుకునే వారంతా శత్రువులేనని, అలాంటి వారిని నిలువ రించాల్సిన బాధ్యత ప్రజలదేనన్నారు. గడిచిన కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఆగిపోయిన అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లయ్యే 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా రాష్ట్రం ఎదగాలని తెలంగాణ రైజింగ్ 2047ను దార్శనికతతో ముందుకు వెళుతున్నామన్నారు. మూసీ ప్రక్షాళన, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొంత మందికి ఇష్టం లేదన్నారు. ఒక నాడు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడితే అది ఎందుకుకార్లు ఉన్న వారి కోసమా అని అవహేళన చేశారని గుర్తు చేశారు. హైదరాబాద్ నీటి సమస్యతో గతంలో ఖాళీ కుండల ప్రదర్శనలు కనిపించేవని, తాగునీటి సమస్య పరిష్కారానికి కృష్ణా నదీ జలాలను తరలించగా, అవి కూడా సరి పోకపోవడంతో, గోదావరి, మంజీరా జలాలను తరలించడం జరిగిందన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి చేయాల్సింది ఇంకా చాలా ఉందన్నారు. అందుకే మన టార్గెట్ బెంగుళూరు, చెన్నై, ఢిల్లీ నగరాలతో



కాదు. న్యూయార్క్, సింగపూర్, టోక్యో నగరాలతో పోటీ పడదలచుకున్నామని స్పష్టం చేశారు. అందుకు మనకు చేతనవుతుందని, మన దగ్గర సాంకేతిక నైపుణ్యం ఉందన్నారు. కావలసింది చిత్తశుద్ధి మాత్రమేనని అన్నారు. మిగతా రాష్ట్రంలో సబర్మతీ, యమునా, గంగా నదులను ప్రక్షాళన చేస్తున్నప్పుడు హైదరాబాద్ నగర ప్రతిష్టను పెంచే మూసీ నది ప్రక్షాళన చేపడితే ఎందుకు అడ్డుపడుతున్నారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.. ఓల్డ్ సిటీ కాదు ఒరిజినల్ సిటీ అని, దాన్ని గోల్డ్ సిటీగా మార్చాలన్నారు. మూసీని పునరుజ్జీవింపజేసి నైట్ ఎకానమీని పెంచాలని అనుకుంటున్నామని తెలిపారు. ఆ ప్రాంతంలో వ్యాపారాలు వృద్ధి చెందాలని, ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అలాగే సాయంత్రం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు వ్యాపారాలు సాగేలా నైట్ ఎకానమీని వృద్ధి చేయాలన్నారు. నైట్ ఎకానమీ వృద్ధి సాధించాలంటే ఎలివేటెడ్ కారిడార్ రావాలని, 20 టీఎంసీల గోదావరి జలాలను తరలించి 365 రోజుల పాటు మూసీలో నీరు ఉండే విధంగా రివర్ ఫ్రంట్ ను అభివృద్ధి చేసి, ఆర్థికంగా తెలంగాణ ప్రపంచంతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. నగరాల్లో మధ్య తరగతికి రాజీవ్ స్వగృహ ద్వారా సరసమైన ధరలకు ఇళ్లు కట్టుకోవడానికి వీలు కల్పించాలమని, ఇందుకు మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి ప్రణాళికలు రూపొందించాలన్నారు. మధ్య తరగతి గురించి ఆలోచన చేయాలని, వారికి సొంతింటి కల నెరవేరాలంటే నగరం విస్తరణ అవసరం అన్నారు. మెట్రో, రీజినల్ రోడ్డు, మూసీ ప్రక్షాళన వంటివి జరగాలన్నారు. ఎంతో పేరు ప్రఖ్యాతులు సాధిస్తున్న తరుణంలో హైదరాబాద్ నగరాన్ని మురికి కూపంగా, చెత్త చెదారం పేరుకు పోయిన నగరంగా, నిత్యం ట్రాఫిక్ జామ్ సమస్యలతో అలాగే వదిలేయడానికి వీలులేదన్నారు. ఒక గొప్ప విశ్వనగరంగా రూపుదిద్దుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## నేర్చుకున్న జ్ఞానంతో సమాజంలో మంచి మార్పు తీసుకురావాలి

### కన్నుల పండువగా గీతాంజలి ఇంజినీరింగ్, టెక్నాలజీ కళాశాలలో 17వ దీక్షా స్నాతకోత్సవం




**హైదరాబాద్,ఆగస్టు 20,(తెలంగాణ దిశ):** గీతాంజలి ఇంజినీరింగ్, టెక్నాలజీ కళాశాల 17వ దీక్షా స్నాతకోత్సవం బుధవారం కళాశాల ప్రాంగణంలో కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రఖ్యాత సాహిత్య కారిణి, సామాజిక కార్యకర్త డాక్టర్ లేఖ శిష్ట ప్రధాన అతిథిగా, ప్రముఖ టెక్నోక్రాట్, విజయవంతమైన సాఫ్ట్ వేర్ వ్యవస్థాపకులు సూర్య వడ్లమాని విశేష అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గీతాంజలి కళాశాల చైర్మన్ జిఆర్. రవీందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ బ్యాచ్ విద్యార్థులు విద్యార్జన చేసిన కఠినమైన సమయాన్ని గుర్తుచేసుకున్నారు." కళాశాల నుంచి వెళుతున్న మీరు కేవలం ఇంజినీర్లు మాత్రమే కాదని, మంచి మానవులుగా, జవాబుదారీ తనం గల పౌరులుగా ఉండాలని వ్యవహరించాలని సూచించారు. నేర్చుకున్న జ్ఞానంతో సమాజంలో మంచి మార్పు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రధాన అతిథి డాక్టర్ లేఖ శిష్ట మాట్లాడుతూ "టెక్నాలజీ, ఇంజినీరింగ్ అనేవి మానవత్వానికి సేవ చేయడానికి ఉపకరణాలు మాత్రమేనని అన్నారు. మీరు ఎంతటి సాంకేతిక నైపుణ్యం సంపాదించినా, మీలోని మానవీయ భావాలు, సృజనాత్మకత, సంప్రదాయాల పట్ల ఎప్పుడు గౌరవం కోల్పోవద్దని సూచించారు. జీవితంలో విజయం అనేది సంపదకు మాత్రమే పరిమితం కాదని, మీ చుట్టూ ఉన్న వారి జీవితాల్లో సానుకూల ప్రభావం చూపించడంలోనే ఉందన్నారు.

విశేష అతిథి సూర్య వడ్లమాని తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. "ప్రస్తుతం ప్రపంచం అత్యంత వేగంగా మారుతున్న సమయమని అన్నారు. ఏ 1 మెషిన్ లెర్నింగ్, గ్రీన్ టెక్నాలజీలు భవిష్యత్తును మారుస్తాయని అన్నారు. నిరంతరం నేర్చుకోవడం, అనుకూలంగా మారడం మర్చిపోవద్దని, ఎదుర్కొనే ప్రతి సవాళ్ళను అవకాశాలుగా చూసుకోవాలని అన్నారు.

మీరు సాధించిన విజయాలకు మాత్రమే కాక, ఎదుర్కొన్న వైఫల్యాల నుంచి నేర్చుకున్న పాఠాలకు కూడా గర్వపడండి" అని ఆయన సలహా ఇచ్చారు. ఈ సందర్భంగా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు స్నాతక పట్టాలు పంపిణీ చేయడం, వివిధ శాఖలలో ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులు, పతకాలు ప్రధానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాగర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అన్ని శాఖల ఫ్యాకల్టీ, సిబ్బంది, విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ హరిశ్చంద్ర రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఉదయ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ సాగర్, అధ్యాపక వర్గం, సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థినీలకు నాప్కిన్స్ పంపిణీ

### ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

### మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి







**భువనగిరి, ఆగస్టు 20, (తెలంగాణ దిశ) :** భారత మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నారీ మహిళా ఆరోగ్య సంకల్పం ప్రియదర్శిని ఉడాన్ సానిటరీ నాప్కిన్స్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళా కాంగ్రెస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు నీలం




పద్మ వెంకటస్వామి ఆధ్వర్యంలో ఆలేరులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రాజీవ్ గాంధీ జయంతి ఉత్సవాలలో భాగంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం స్కూల్ విద్యార్థినీలకు నారీ మహిళా ఆరోగ్య సంకల్పం ప్రియదర్శిని ఉడాన్ (శానిటరీ నాప్కిన్స్)ను పంపిణీ చేశారు. మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలంబ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీత రావు ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో నీలం పద్మ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం బాలిక రక్షణ దృష్ట్యా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉచితంగా శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. మహిళలు, బాలికలు సురక్షితంగా ఉండటంతో పాటు క్యాన్సర్, రిప్రొడక్టివ్ సమస్యలను నివారించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సాంకేతిక విప్లవం ద్వారా భారత దేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా పునాదులు వేసిన రాజీవ్ గాంధీ కంప్యూటర్, టెలికాం రంగాల అభివృద్ధికి నాంది పలికారని అన్నారు. తద్వారా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేశారని, ఓటు హక్కు వినియోగించుకునే వయస్సును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వరకు తగ్గించారని ఆమె గుర్తు చేశారు. అదే విధంగా జవహర్ రోజ్ యోజన వంటి పథకాల ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేశారని అన్నారు. పల్లెకు పట్టం కట్టి దేశాన్ని టెక్నాలజీ వైపు నడిపించి ఐటీ రంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలపడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన స్ఫూర్తి దాత రాజీవ్ గాంధీ అని అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా గ్రామస్థాయి పాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించారని అన్నారు. భారతరత్న రాజీవ్ గాంధీ స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలని నీలం పద్మ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మి, స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు దాసరి మంజుల, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పడమటి పావని, జిల్లా ప్రధాన కార్యదర్శి కవిత, వనజరెడ్డి, సిద్ధి లక్ష్మి, మాధవి, ఝాన్సీ, నవనీత, నాగలక్ష్మి, పాము అనిత, భానుమతి, రేణుక, సరోజనమ్మ, సంధ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి నగర్ లో వెలుగు చూసిన టెన్నిస్ కోర్టు కుంభకోణం

## - దారి మళ్ళిన కార్పొరేషన్ కు చెల్లించాల్సిన 50 లక్షలు..?


OFFICE OF THE NIZAMPET MUNICIPAL CORPORATION
MEDCHAL – MALKAJGIRI DISTRICT
Lr.No.:E1/NMC/100 /2025-26, dated: 18-08-2025

Sir,

Sub : Nizampet Municipal Corporation - Request for information under Right to Information Act,2005 - Submitting information - Reg.

Ref : Representation letter of Malyak Ramani, Dt: 30.07.2025.

With reference to the subject cited, you have requested to provide the information regarding Tennis Court Tender of Pragathi Nagar Division in Nizampet Municipal Corporation.

| SL No | Question | Answer |
|---|---|---|
| 1 | Details about the tennis court tender (2020 to 2025) related to Pragathi nagar division, Municipal Corporation, and to whom the tennis court tender was awarded? Can you provide on what basis the tender were allocated? | No Tender were called from the Engineering Department from 2020 to June 2025. |
| 2 | Those who have secured the tender for the tennis court from 2020 to June 2025 can provide the details of the amount paid to the Corporation. | |

In this regard, as per your request, providing information to you under RTI Act 2005.

Asst. Public Information Officer
Nizampet Municipal Corporation

To,
Ramani Malyak,
Asha Jyothi Women Network,
Kousalya Colony, Bachupally.



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 20, (తెలంగాణ దిశ)** :నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కు చెల్లించాల్సిన టెన్నిస్ కోర్టు అద్దె డబ్బులు గోల్మాల్ అయ్యాయి. 2020–2025 సంవత్సరాలకు చెందిన సుమారు రూ. 50 లక్షల నిధులు కార్పొరేషన్ కు వెళ్లకుండా కొందరు వ్యక్తుల జేబులోకి వెళ్లినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ నేత మల్యాల రమణి సమాచార హక్కు చట్టం ద్వారా కార్పొరేషన్ అధికారుల నుండి సమాచారం తీసుకోవడంతో రూ.50 లక్షల నిధులు కార్పొరేషన్ కు అందకుండా కొందరు వ్యక్తుల జేబుల్లోకి వెళ్లినట్లు నిర్ధారణ అయింది. ఈ విషయమై ఆమె గత కొద్ది రోజులుగా ప్రభుత్వ విభాగాల నుండి సమాచారం కోసం ప్రయత్నించగా అసలు విషయం బయట పడింది. ప్రస్తుత 2025 సంవత్సరానికి గాను అదే టెన్నిస్ కోర్టును లీజుకు వేలం పాట వేయగా నెలకు అక్షరాల రూ. 80వేలఅద్దెను చెల్లించేందుకు ఒక కోచ్ ముందుకొచ్చి పాట పాడి దక్కించుకున్నారు. అయితే సుమారుగా ఇంతకాలం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు టెన్నిస్ కోర్టు నుండి లీజు డబ్బులు వసూళ్ళు చే యకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతన్నాయి. ఇందులో గత పాలకులు దొరికిన కాడికి టెన్నిస్ కోర్టు డబ్బులను వాడుకొని మున్సిపల్ కార్పొరేషన్ కు పంగ నామం పెట్టినట్లు అర్థమవుతుంది. ఇందులో నాటి, నేటి అధికార పక్షం వారే పాత్రధారులుగా ఉన్నారని అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. అయితే గత పది సంవత్సరాలుగా ఒక వ్యక్తి మాత్రమే టెన్నిస్ కోర్టు కోచ్ గా వ్యవహరించడం, ఆయన గత అధికార పక్షంలోని ఒక వ్యక్తికి బినామీగా వ్యవహరించి, కార్పొరేషన్ కు రావలసిన సుమారు రూ.50 లక్షల నిధులను కొల్లగొట్టాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై మల్యాల రమణి ప్రాథమిక సమాచారం సేకరించి అనంతరం హైకోర్టును ఆశ్రయించనున్నట్లు సమాచారం. అయితే కార్పొరేషన్ పరిధిలోని ఆస్తుల నుండి ప్రతి ఏటా బహిరంగ వేలం ద్వారా లీజు కుదుర్చుకోవాల్సి ఉండగా అందుకు భిన్నంగా కార్పొరేషన్కు రావలసిన రూ. 50 లక్షల నిధులు మాయమయ్యాయని స్పష్టమవుతుంది. ఈ వ్యవహారం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చర్చనీయంగా తయారయింది. మరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కార్పొరేషన్ కు రావలసిన రూ. 50 లక్షల నిధులను మింగిన వ్యక్తిపై ఏ రకమైన చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే.

# శామీర్ పేట్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 20, (తెలంగాణ దిశ)** :శామీర్ పేట్ లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి తనిఖీ చేశారు. పై కప్పు నుండి వాటర్ లీకేజీ, బెడ్స్ కొరత, వాష్ రూమ్స్ నిర్వహణలో లేవని, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని మెడికల్ ఆఫీసర్ శివకిరణ్ కలెక్టరుకు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ ఆసుపత్రి భవనం పైన నీరు లీకేజీ కాకుండా రేకులతో షెడ్ ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ, బెడ్స్, వాష్ రూమ్స్ నిర్వహణకు అవసరమైన నిధులు ఇస్తానన్నారు. ప్రహారీ గోడ నిర్మించి, గేటు ఏర్పాటు చేసుకోవాలని అత్యంత అవసరమైన మౌళిక వసతులకు వెంటనే నివేదికలు పంపాలనిమెడికల్ ఆఫీసర్ కు సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించారు, ఆసుప్రత్రిలో ఏమేమి సమస్యలున్నాయని మెడికల్ ఆఫీసర్ ను అడిగారు. ఫీవర్ సర్వే జరుగుతుందా అని, డెంగ్యూ కేసులు ఎన్ని ఉన్నాయని కలెక్టర్ అడుగగా, ఈ నెల రెండు డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. వారికి చికిత్స అందిస్తున్నామన్నారు. ల్యాబ్, లేబర్ రూం, స్టోర్ అన్ని విభాగాలను కలెక్టర్ తిరిగి పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ తహాసీల్దారు యాదగిరి రెడ్డి, డిసిహెచ్ ఎస్. సునీత, మెడికల్ ఆఫీసర్ శివకిరణ్, మెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఈ నెల 25 నుండి 30 వరకు తెలంగాణ విద్యార్థి పోరు యాత్ర

## - పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పథ్వీ




**భద్రాచలం, ఆగస్టు 20, (తెలంగాణ దిశ)** : రాజకీయ మైలేజ్ కోసమే విద్యారంగంలో రేవంత్ రెడ్డి కొత్త హామీలు ఇస్తున్నారని పిడిఎస్ యురాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ విమర్శించారు. భద్రాచలంలో జరిగిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు) భద్రాచలం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో భద్రాచలం డివిజన్ కమిటీ కార్యదర్శి మునిగల శివ ప్రశాంత్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పథ్వీ మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడం వలన ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో లక్షల రూపాయల వసూలు చేస్తున్నారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు, కళాశాలలను నడిపిస్తున్న, ఫీజులు దోపిడీ చేస్తున్న ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు లేక టీచర్ పోస్టుల ఖాళీల మూలాన విద్య వ్యవస్థ కుంటుపడుతున్నదన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. విద్య బాగు కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి 7 శాతానికి మించి బడ్జెట్ కేటాయించక పోవడం మూలాన ప్రభుత్వ విద్యా వ్యవస్థ గాడి తప్పింది అన్నారు. వెంటనే విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నియమించకుండా కాలయాపన చేస్తూ 500 పైగా ఎంఈఓ, 28 డిఇఓ పోస్టుల ఖాళీల మూలాన క్షేత్రస్థాయిలో పరిశీలన చేసే విద్య అధికారులు లేకపోవడం వల్ల గురుకులాలు, సంక్షేమ హాస్టల్లో నిత్యం విద్యార్థులు కల్తీ ఆహారంతో అస్వస్థకు గురవుతున్నారని వాపోయారు. అలాగే విద్య ప్రమాణాలు దెబ్బతింటున్నాయని అన్నారు. పిడిఎస్ యు భద్రాచలం డివిజన్ కార్యదర్శి మునిగల శివ ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో రూ. 8 వేల కోట్ల పెండింగ్ ఫీజులను విడుదల చేయకపోవడం వలన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని అన్నారు. తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు భద్రాచలం డివిజన్ అధ్యక్షులు రామ్ చరణ్, డివిజన్ నాయకులు పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


# ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ




**నాచారం, ఆగస్టు 20, (తెలంగాణ దిశ)** :ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని కాప్రా సర్కిల్ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో నాచారం ఎర్రకుంటలో దోమ కాటు వ్యాధుల నివారణపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిహెచ్ఎంసి సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవరెడ్డి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ రోనాల్డ్ రాస్ అనే బ్రిటిష్ మిలిటరీ వైద్యుడు బేగంపేట లో 1897లో ఆగస్టు 20వ తేదీన మలేరియా వ్యాధి మనుషులకు వ్యాపిస్తుందని తన ప్రయోగాల ద్వారా ప్రపంచానికి తెలియజేయడంతో నోబెల్ బహుమతి లభించిందన్నారు. ఆగస్టు 20వ తేదీన ప్రపంచ దోమల దినోత్సవంగా ప్రపంచమంతా నిర్వహించుకుంటుందని మాధవరెడ్డి తెలిపారు. ఏఈ రమేష్ ఆధ్వర్యంలో ఎంటమాలజీ, శానిటేషన్, ఆశ వర్కర్ల ఆధ్వర్యంలో ఎర్రకుంటలో దోమలు అభివృద్ధి చెందేందుకు అనుకూల పరిస్థితులు, వాటి అభివృద్ధి నిరోధించేందుకు తీసుకోవలసిన చర్యలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ ఓ డాక్టర్ మధుసూదన్ రావు, సానిటరీ సూపర్ వైజర్ సుదర్శన్, ఈఎఫ్ఏ నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండాలి

## - జిల్లా అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
## - జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, ఎస్పీ రోహిత్ రాజుతో ఫోన్ లో మాట్లాడిన మంత్రి తుమ్మల



**భద్రాచలం, ఆగస్టు 20, (తెలంగాణ దిశ)** : ఎగువ నుండి వస్తున్న వరద ఉధృతితో భద్రాచలం వద్ద 46 అడుగులు దాటి రెండో ప్రమాద హెచ్చరిక దిశగా గోదావరి వరద ప్రవాహం ఉండటంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు. భద్రాచలం రామాలయం వద్ద కరకట్ట స్లూయిసుతో పాటు గోదావరీ కరకట్టకు ఉన్న స్లూయిసుల నుండి వరద నీరు భద్రాచలం పట్టణంలోకి, కాలనీలకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత వరదల అనుభవాలు దృష్టిలో పెట్టుకుని ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయితీ రాజ్ శాఖల ఉద్యోగులు, సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని మంత్రి తుమ్మల తెలిపారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని, వరద ఉధృతి ఎక్కువైతే పునరావస కేంద్రాలు, గజ ఈతగాళ్ళు ఎన్డీఆర్ఎఫ్ టీంలు, వైద్య సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. రైతులు, పశువుల కాపరులు వాగులు వంకలు దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తుమ్మల సూచించారు. పోలీస్ సిబ్బంది వాగులు కల్వర్టుల వద్ద బందోబస్తుగా ఉండాలని, ఏ ఒక్కరికి ప్రాణ నష్టం లేకుండా అత్యవసర వైద్య సేవలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# బాచుపల్లిలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 20, (తెలంగాణ దిశ)** :భారత మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నేతలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ కొలను హనుమంత్ రెడ్డి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదే అని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ ను నిలబెట్టడానికి స్వర్గీయ రాజీవ్ గాంధీ ఎంతో కృషి చేశారని ఆయన కొనియాడారు. పేదరిక నిర్మూలన, సమ సమాజ స్థాపనకు ఆయన కృషిని ఎవరూ కాదనలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నిజాంపేట కార్పొరేషన్ అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డి, బహదూర్ పల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, ఐఎన్ టియుసి నాయకులు నర్సింగరావు, మల్లికార్జున్ షామీర్ పేట్ ప్రకాష్, ఎండి. ఉస్మాన్, షఫీ, దుద్దు రాహుల్, శైలజ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 25న శ్రీ సోమేశ్వరస్వామి నవగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం



**కాప్రా, ఆగస్టు 20, (తెలంగాణ దిశ)** :కాప్రా సాయిబాబా నగర్ లోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి సహిత శ్రీ సోమేశ్వర్ స్వామి దేవస్థానంలో శివలింగ నందీ దేవస్థానంలో జీర్ణోద్దరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 25న ఉదయం 6.40 గంటలకు శ్రీ సోమేశ్వరస్వామి నవగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 23 శనివారం నుంచి 25 సోమవారం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఎ. వినోద్ కుమార్, పి. దామోదర్ గౌడ్, ఎవి. రాము, రాము యాదవ్, ఎస్ కృష్ణ, వెంకట్ స్వామి, పి జగన్ కుమార్, సిహెచ్. మల్లేష్ తెలిపారు. వేద పండితులు బ్రహ్మశ్రీ శివ కార్తీక్ శాస్త్రి ప్రతిష్టాన చార్యుల వారిచే త్రయోనిక దీక్షతో దివ్య ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి సహిత శ్రీ సోమేశ్వర్ స్వామి దేవస్థాన కమిటీ నిర్వాహకులు తెలిపారు.



# ఓక్షిత్ హిల్స్, వ్యూ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 20, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 డివిజన్ గాజుల రామారం పరిధిలోని ఓక్షిత్ హిల్స్, వ్యూ కాలనీలో రూ. 55 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సిసి రోడ్డు పనులను బుధవారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. ఆయా కాలనీలో రోడ్డు బాగోలేదని కాలనీవాసులు నెల రోజుల క్రితం హన్మంత్ రెడ్డి హనుమంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో విషయాన్ని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేక నిధుల ద్వారా సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించారు. సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడంతో కాలనీవాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రావణ్ కుమార్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, బహదూర్ పల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, నాయకులు అమీర్, అఫ్జల్, నరేష్, సోమిరెడ్డి, నాయుడు, విజయ్, కుమార్, అరుణ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ లో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి ఉత్సవాలు





**మల్లాపూర్, ఆగస్టు 20, (తెలంగాణ దిశ)** :భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను బుధవారం మల్లాపూర్ లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ జయంతి ఉత్సవాలకు కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పూల మాలలు వేసి మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంజి రెడ్డి, సీతారామ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థినీలకు ఉచితంగా శానిటరీ నాప్కిన్స్ పంపిణీ

## మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీత రావు








**శంకర్ పల్లి, ఆగస్టు 20, (తెలంగాణ దిశ) :** భారత మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నారీ మహిళా ఆరోగ్య సంకల్పం ప్రియదర్శిని ఉడాన్ సానిటరీ నాప్కిన్స్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీలకు శానిటరీ నాప్కిన్స్ ను ఉచితంగా పంపిణీ చేశారు. రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీత రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలంబ ఆదేశాల మేరకు భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో మహిళలకు, విద్యార్థులకు న్యాప్కిన్లను పంపిణీ చేశామని సునీతరావు తెలిపారు. మహిళల ఆరోగ్యం, బాలిక రక్షణ దృష్ట్యా మహిళా కాంగ్రెస్ ఉచితంగా శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. మహిళలు, పిల్లలు సురక్షితంగా ఉండటం క్యాన్సర్, రిప్రొడక్టివ్ సమస్యలను నివారించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని సునీతరావు తెలిపారు. సాంకేతిక విప్లవం ద్వారా భారత దేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా పునాదులు వేసిన రాజీవ్ గాంధీ కంప్యూటర్, టెలికాం రంగాల అభివృద్ధికి నాంది పలికారని అన్నారు. తద్వారా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేశారని, ఓటు హక్కు వినియోగించుకునే వయస్సును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వరకు తగ్గించారని ఆమె గుర్తు చేశారు. అదే విధంగా జవహర్ రోజ్ యోజన వంటి పథకాల ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేశారని అన్నారు. పల్లెకు పట్టం కట్టి దేశాన్ని టెక్నాలజీ వైపు నడిపించి ఐటీ రంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలపడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన స్ఫూర్తి దాత రాజీవ్ గాంధీ అని అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా గ్రామస్థాయి పాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించారని అన్నారు. భారతరత్న రాజీవ్ గాంధీ స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలని నీలం పద్మ సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రెండు విడతల్లో సర్పంచ్ ఎన్నికలు





**నిజామాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు ఆదేశించడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు ముమ్మరం చేసింది. రెండు విడతల్లో సర్పంచ్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లకు ఒక విడత, బోధన్‌కు మరో విడత పోలింగ్ జరిగే అవకాశం ఉంది. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ పెట్టెలు, బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేశారు. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది.తెలంగాణలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. స్థానిక సంస్థల పదవీకాలం పూర్తయ్యి దగ్గరదగ్గర ఏడాదిన్నర కావొస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎన్నికల నిర్వహించలేదు. ఈ అంశంపై కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో.. సెప్టెంబర్ 30 నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణ తప్పనిసరి అయ్యిందిఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ఎలక్షన్ నిర్వహణకు సర్వం సిద్ధం చేసి రెడీగా ఉంది. నోటిఫికేషన్ రావడమే తరువాయి అంటున్నారు అధికారులు. అయితే త్వరలోనే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు జరగున్నాయి. ఈ క్రమంలో సర్పంచి ఎన్నికలకు సంబంధించిన ఓ వార్త వినిపిస్తోంది. రెండు విడతల్లో సర్పంచి ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు రెడీ అవుతున్నారని తెలుస్తోంది. ఆ వివరాలు..రాష్ట్ర ఎన్నికల సంఘం సర్పంచ్ ఎన్నికల గురించి కీలక ప్రకటన చేసింది. గతంలో అనగా 2019 సర్పంచ్ ఎన్నికలు రెవెన్యూ డివిజన్ల వారీగా మూడు విడతలుగా జరిగేవి. కానీ ఈసారి రెండు విడతల్లోనే పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీనికి తగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2019లో పంచాయతీ ఎన్నికలు మూడు విడతలుగా జరిగాయి. రాజకీయ పార్టీల గుర్తులు ఉండవు కాబట్టి ఫలితాలపై ప్రభావం ఉండదని అలా చేశారు. కానీ ఈసారి రెండు విడతల్లోనే పోలింగ్ పూర్తి కానుంది. ఈక్రమంలో నిజామాబాద్ జిల్లాలో ఆర్మూర్, నిజామాబాద్, బోధన్ అనే మూడు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. జిల్లా అధికారులు అంచనా ప్రకారం ఆర్మూర్, నిజామాబాద్ డివిజన్లకు ఒకసారి, బోధన్‌కు మరోసారి పోలింగ్ జరిగే అవకాశం ఉంది. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది అంటున్నారు. పంచాయతీ ఎన్నికలకు కావాల్సిన బ్యాలెట్ పెట్టెలు సిద్ధంగా ఉన్నాయని ఎన్నికల సంఘం అధికారులు తెలుపుతున్నారు.ఎన్నికల నిర్వహణ కోసం నిజామాబాద్ జిల్లాలో ఉన్న వాటితో పాటు కర్ణాటక నుంచి కూడా తెప్పించమని చెప్పుకొచ్చారు. సర్పంచ్ స్థానాలకు 2,531 జంబో పెట్టెలు, వార్డు సభ్యుల స్థానాలకు 1,380 చిన్న పెట్టెలు రెడీగా ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేసి భద్రంగా ఉంచామని అధికారులు తెలిపారు. మొత్తం 545 గ్రామ పంచాయతీల్లో 5,022 వార్డులు ఉన్నాయి. మొదటి దశ పోలింగ్ అయిపోయిన తర్వాత బ్యాలెట్ పెట్టెలను రెండో విడత ఎన్నికలు జరిగే గ్రామాలకు తరలిస్తారు.

## భారీ వర్షాల నేపథ్యంలో రైతులు ప్రజలు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

**-ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు**

మంథని,తెలంగాణ దిశ : రానున్న రోజుల పాటు పెద్దపల్లి జిల్లాలో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు ప్రజలు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు పేర్కొన్నారు. చిన్న పిల్లలూ మరియు విద్యార్థులు, దయచేసి మీ ఆరోగ్యానికి మరియు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మీ పాఠశాల లేదా విద్యాసంస్థ అధికారులతో మాట్లాడి, వీలైతే ఇంటి నుంచే ఆన్లైన్ తరగతులు వినాలని, బయట ఆడుకోవడం మానివేయాలని నిలిచిన నీటి దగ్గరకి వెళ్ళవద్దని ఆయన సూచించారు. ఇంట్లోనే పొడిగా, చల్లదనం లేని ప్రదేశాల్లో ఉండలన్నారు. అధిక వర్షాలు పడుతున్న కారణంగా రైతులందరు మీ భద్రత ప్రథమం అని భావించాలని శ్రీను బాబు అన్నారు. చేతితో వాటిని డైరెక్ట్ గా తాక వద్దని సూచించారు

# కొంప ముంచుతున్న డేటింగ్ యాప్స్..





హైదరాబాద్,తెలంగాణ దిశ : పస్తుతం డేటింగ్ యాప్‌లు ఎక్కువగా ఉంటున్నాయి. ఇందులో తెలియని వ్యక్తులతో డేటింగ్ చేస్తుంటారు. చివరకు ఇదే కొంపముంచుతుంది. తాజాగా ఇలాంటి ఘటనే హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్‌జీబీటీ డేటింగ్ యాప్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన ఓ 65 ఏళ్ల వ్యక్తి ఓ యువకుడితో మాట్లాడా డు. మొదట్లో చాటింగ్ చేసుకునే వారు. ఆ తర్వాత ఓ హోటల్‌లో ఇద్దరు కలిశారు. వీరిద్దరూ కలిసి నగ్నంగా ఉన్న సమయంలో మరో ఇద్దరు వ్యక్తులు వీరి ఫొటోలు తీసి బెదిరించారు. 65 ఏళ్ల వ్యక్తి నుంచి డబ్బులు వసూలు చేశారు. ఎన్ని సార్లు ఇచ్చినా మళ్లీ అడగడంతో ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారుప్రస్తుతం హైదరాబాద్‌లో ఇలాంటి కేసులు పెరుగుతున్నాయి. ఇలాంటి డేటింగ్ యాప్‌లో కలిసి మోసం చేస్తున్నారు. ఎక్కువగా స్వలింగసంపర్కుల మధ్య ఇలాంటివి జరుగుతున్నాయి. సాధారణంగా ఈ ఎల్‌జీబీటీ యాప్స్‌లో లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్స్ ఉంటారు. ఇందులో ఎవరైతే ధనికులు ఉంటారో వారినే టార్గెట్ చేసి మోసం చేస్తున్నారు. వీరికి ఈయాప్స్ ద్వారాదగ్గర అయ్యి ముగ్గు లోకి దించుతున్నారు. ఆ తర్వాత వారిని హోటల్స్, ఫామ్ హౌస్‌లకు పిలిచి మత్తులోకి దించి నగ్న ఫొటోలు తీస్తున్నారు. ఇటీవల హైదరా బాద్‌కి చెందిన మరో డాక్టర్‌కు కూడా ఇలానే జరిగింది. ఒక యాప్‌లో పరిచయమైన వ్యక్తితో చాటింగ్ చేశాడు. ఆ తర్వాత ఆ వ్యక్తి పిలవగానే ఒక ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. అక్కడ ఇద్దరూ మద్యం తాగారు.మద్యం మత్తులో ఉన్నప్పుడు, ఆ వ్యక్తి డాక్టర్ నగ్న ఫొటోలు తీశాడు. ఈ విషయం తెలియని డాక్టర్ అక్కడి నుంచి తిరిగి వచ్చాడు. కానీ కొన్ని రోజుల తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు డాక్టర్ నగ్న ఫోటోలను వాట్సాప్‌లో పంపి, బ్లాక్ మెయిల్ చేయడం మొదలుపెట్టారు. భయపడిన డాక్టర్ మోసగాళ్లు అడిగిన డబ్బులు ఇచ్చారు. ఇలాంటి కేసులు ఎక్కువగా రావడంతో పోలీసులు వీరిపై నిఘా పెట్టారు. డేటింగ్స్, ట్రాన్స్ వారిని గుర్తిస్తున్నారు. మోసం చేసేవారు ముందుగా ఎల్‌జీబీటీ యాప్స్‌లో సభ్యత్వం తీసుకుంటారు. ఆ తర్వాత పలుకుబడి, డబ్బులు ఉన్న వారిని టార్గెట్ చేస్తారు. వారితో ప్రేమగా మాట్లాడి, స్నేహం చేసి మెల్లిగా తమ ఉచ్చులోకి లాగుతారు. ఇలాంటి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సోషల్ మీడియా ఎక్కువ కావడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. తెలియని వ్యక్తులను కలిసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఎక్సైజ్ సీఐ,ఆధ్వర్యంలో డ్రగ్స్ పై అవగాహన సదస్సు..




**జమ్మికుంట,తెలంగాణ దిశ :** స్థానిక జమ్మికుంట గాయత్రి డిగ్రీ మరియు పీజీ కళాశాలలో జమ్మికుంట ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సీఐ, మాధవి లత, ఆధ్వర్యంలో డ్రగ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. దీనిని ఉద్దేశించి ఎక్సైజ్ సీఐ,మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి యువత బానిస అవుతే వారి జీవితం సర్వనాశనం అవుతుందని అంతేకాకుండా కన్న తల్లిదండ్రుల యొక్క ఆశయాలను నిర్వీర్యం చేసిన వాళ్ళు అవుతారని డ్రగ్స్ అమ్మేటువంటి లేదా డ్రగ్స్ తీసుకునేటువంటి విద్యార్థిని విద్యార్థులు కావచ్చు ఇంకా ఎవరైనా మీకు తెలిసిన వారు ఉంటే ఎక్సైజ్ సీఐ, కు సమాచారం ఇవ్వవలసి ందిగా పిల్లల్ని ఉద్దేశించి సీఐ మాధవి లత, తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ వి.పెద్దన్న, మరియు ఎండి ఫయాజుద్దీన్, శైలజ, ప్రిన్సిపల్ కుమారస్వామి, అధ్యాపకులు రాగశ్రీ, అంజిబాబు, రమేష్,సాగర్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు...

# విభజనతో పాటే కాశ్మీర్ చిచ్చు



## నాటి పాలకుల దృష్టి లోపం

## సమర్థ నాయకత్వ లోపంతో సమస్యలు

న్యూఢిల్లీ, : బ్రిటిష్ పాలకలు దేశాన్ని విభజించడమే కాకుండా.. అనేక మెలికలు పెట్టి వెళ్లారు. అలాంటి దాంట్లో కాశ్మీర్ సమస్య ఒకటి. నేటికీ అది రావణకాష్టంగా మారడానికి కారణం వారి కుత్సిత రాజకీయ తంత్రమే. వెళుతూవెళుతూ సంస్థానాలను వారి స్వేచ్ఛకు వదిలేసి వెళ్లారు. ఇదే క్రమంలో భారత్ ఆశ్రయం పొంది భారత్‌లో విలీనం కావడానికి కాశ్మీర్ రాజు హరిసింగ్ చేసిన ప్రయత్నాల ను విభజిత పాక్ అడ్డుకుంది. కొంత భాగాన్ని ఆక్రమించడంతో దిక్కులేని స్థితిలో కాశ్మీర్ రాజు భారత్ ఆశ్రయం పొందాడు. అయితే ఆనాటి ప్రధాని నెహ్రూ తాత్సారం, ఉదాసీనత కారణంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ సమస్య అలాగే ఉండిపోయింది. అలాగే 370 ఆర్టికల్‌తో కొత్తచిచ్చును కూడా నెహ్రూ రాజేశారు. తొలుత కశ్మీర్ రాజు హరిసి ంగ్ స్వతంత్రంగా ఉంటానని చేసి, పాకిస్థాన్‌తో మమేకం అయ్యేందు కు ప్రయత్నించారు. కానీ వెంటనే తమతో మమేకం కాకపోవడంతో పాకిస్థాన్‌లోని ప్రభుత్వం ఆక్రమిత కశ్మీర్ భాగంలోని గిరిజనులను ఉసిగొలిపితే కశ్మీర్ రాజు హరిసింగ్.. నాటి నెహ్రూ ప్రభుత్వాన్ని శరణు కోరారు. తర్వాత కశ్మీర్ కూడా భారతదేశంలో భూభాగమైనా.. ఆక్రమిత కాశ్మీర్ సమస్యనేటికీ తెగడంలేదు. కాశ్మీర్ రాజు ఒప్పందం మేరకు కాశ్మీర్ యావత్తూ భారత్ భూభాగంగా ఉండాలి. కానీ పాక్ పాలకు తీరు, నాటి భారత్ పాలకుల ముందు చూపు లేకపోవడం కారణంగా నేటికి దానిని రావణ కాష్టంగా మార్చేశాయి. మిలిటెంట్ల చొరబాట్లు, పాక్ సైన్యం అకారణంగా కాల్పులు జరుపడం నిత్యకృత్యంగా మారింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు దారి తీసింది. మత ఘర్షణల నివారణకే దేశ విభజన వందేండ్ల పోరాటం తర్వాత భారత్ 1947లో వలస పాలకుల నుంచి విముక్తి పొందింది. బ్రిటన్ పార్లమెంట్ స్థానంలో భారత స్వాతంత్ర్య చట్టం అమలులోకి వచ్చింది. ఆగస్టు 15వ తేదీ నుంచి బ్రిటీషువారి పాలన ముగుస్తుందని ఆ చట్టం నిర్దేశించింది. అలాగే దేశాన్ని రెండు సార్వభౌమ దేశాలైన ఐక్య భారత్, అధినివేశ పాకిస్థాన్‌గా విభజించాలని సూచించింది. రెండు దేశాలకు కేటాయించాల్సిన ప్రాంతాల పర్యవేక్షణకు బ్రిటీషు వారు సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్‌ను రంగంలోకి దించారు. వృత్తిరీత్యా న్యాయాధికారి రాడ్‌క్లిఫ్‌ను సరిహద్దు కమిషన్‌కు ఛైర్మన్‌గా నియమించారు. ఒక దేశాన్ని రెండు స్వతంత్ర దేశాలుగా విడగొట్టే గీత గీయడానికి ఈ కమిషన్‌ను నియమించారు. ఢిల్లీ దేశ విభజన అనంతరం దాదాపు 1.5 కోట్ల మంది తమ నివాస ప్రదేశాలను వదిలి రాడ్‌క్లిఫ్ గీతకు అటూ ఇటూ ప్రయాణిం చారు. వారిలో కొందరు కాలినడకన, మరికొందరు రైళ్లలో, బస్సుల్లో రవాణా వసతి ఏది దొరికితే దానిలో గీత దాటారు. ఈ సందర్భంగా జరిగిన మతోన్మాద మారణకాండలో దాదాపు పదిలక్షల మంది తమ ప్రాణాలు కోల్పోయారు. లక్షల కుటుంబాలు సర్వస్వం కోల్పోయి వీధిన పడ్డాయి. వేల మంది మహిళలపై లైంగిక దాడులు జరిగాయి. దేశవిభజనతో ఒక ప్రాంతం నుంచి మరోప్రాంతానికి తరలివెళు _న్న నిరాశ్రయులైన జనంతో ఢిల్లీ గుడారాల నగరంగా మారి పోయింది. ఇండ్లను, పుట్టి పెరిగిన ప్రాంతాలను వదిలి, మతకల్లోలాల్లో సర్వం పోగొట్టుకొని శరణార్థులుగా మారారు. పాకిస్థాన్ నుంచి భారత్‌కు వలస వచ్చిన హిందువులు, సిక్కులదీ ఇదే పరిస్థితి. అదే సమయంలో ఢిల్లీ జనాభాలో.. వలస వచ్చిన ప్రజల సంఖ్య దాదాపు మూడోవంతు వరకు చేరుకున్న దంటే.. ఏ స్థాయిలో వలసలు జరిగాయో ఊహించుకోవచ్చు. నిట్టనిలువునా చీలిన పంజాబ్ లోనూ ఇదే పరిస్థితి. పలు కాలేజీలు వలస ప్రజల శిబిరాలుగా మారిపోయాయి. కనీస సౌకర్యాలు లేక, ఆహారం లేక జనం అలమటించిపోయారు. ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ ఆహారం రోజుకు ఒక చపాతీకి తగ్గించారు. ఆకలితో అల్లాడి వేల మంది మరణించారు.

## మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి నష్టం కలిగిస్తుంది: ఆర్జీ-3 జి.యం సుధాకర్ రావు



కమాన్ పూర్: మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి ఆరోగ్యానికి నష్టం కలిగిస్తుందని సింగరేణి సంస్థ రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అన్నారు. "యాంటీ డ్రగ్స్ డే" మాదకద్ర వ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జియం కార్యాల యంనందు అధికారులు, ఉద్యోగులుమాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ ను చేయడం జరిగింది. ఈ సందర్భంగా జియం మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తి ఆరోగ్యానికి, కుటుంబ సమైక్యతకు అపార నష్టం కలిగిస్తుందని యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యమైన జీవితాన్ని గడపాలని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా కొనసాగాలని అన్నారు. కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు సంతోష్, రవికుమార్, అధికారుల సంఘం అధ్యక్షులు సి.హెచ్. వెంకటరమణ, ఎస్వోటుజియం యం.రామ్మోహన్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భాను ప్రసాదరావు, పర్చేజ్ అధికారి ఇ.నా గేశ్వరరావు తోపాటు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆకలి.. ఆకలి..!



జీవం పోసుకున్న ఏ ప్రాణికైనా తొట్ట తొలి పరిచయం అయ్యేది ఆకలి! ఈ క్షణంలోంచి మరో క్షణంలోకి ప్రవహించే ప్రతి క్షణం శక్తిని వినియోగించే ప్రయాణిస్తుంది. ఆవు కడుపులోంచి అప్పుడే బయటికొచ్చిన లేగదూడ శ్వాసించిన మరుసటి క్షణంలోనే పాలధారలు నిండిన పొదుగు వైపు మోర చాస్తుంది. ఆకలి అవసరమై, అత్యవస రమై దానికి దారి చూపిస్తుంది.

అందుచేత అమ్మ కన్నా ముందే ఆకలే బతుకు దారిని చూపే ఆదిమ గురువు అని మనం నిర్ద్వంద్వంగా తీర్మానించవొచ్చు. ఆకలికి అన్వేషణకీ, ఆకలికి ఆవిష్కరణకీ, ఆకలికి ఆచరణకీ ఆదినుంచీ అవినాభావ సంబంధం ఉంది. ఆకలి ప్రకృతి సహజమే కాదుబీ ప్రప్రథమ ఆరోగ్య లక్షణం కూడా. ఆకలితో అల్లాడని ప్రజలు ఉన్న దేశాన్ని సంపన్నదేశం అనొచ్చోలేదో కానీ, సంతోష దేశం అని మాత్రం కచ్చితంగా పేర్కొనవొచ్చు.

ప్రపంచంలో ఆకలితో నకనకలాడే అన్నార్తులు ఉండకూడదన్న భావన తోనే మానవతా సూత్రాలు ఉద్భవించాయి. సాటి జనం క్షుద్బాధను చల్లార్చే మానవీయ దృక్పథంలోంచే అనేకమంది మహానుభావులు పుట్టుకొచ్చారు. "భరత ఖండంబు చక్కని పాడియావు/ హిందువులు లేగదూడలై యేడ్చుచుండ/ తెల్లవారను గడుసరి గొల్లవారు/ పితుకుచున్నారు మూతులు బిగియగట్టి" అని భారతీయుల ఆకలి గురించి, బ్రిటీషు పాలకుల దోపిడీ గురించి బాధపడ్డారు తెలుగు కవి చిలకమర్తి. ఇలా ఒకరి ఆకలికి, ఆవేదనకీ మరొకరు కారణమైనప్పుడు తిరుగుబాట్లు పుట్టుకొస్తాయి. ఉద్యమాలు వెల్లువెత్తుతాయి. ప్రపంచంలోని అత్యధిక ప్రజల అస్తవ్యస్త పరిస్థితికి,

ఆకలి దారిద్ర్యాలకు శ్రమదోపిడీ కారణమని మొట్టమొదట సశాస్త్రీయంగా చెప్పినవాడు కారల్ మార్క్స్. "ఆకలి మంటల మలమలలాడే అనాథలందరు లేవండోయ్!" అంటూ ఆయనిచ్చిన పిలుపు ప్రపంచ ప్రజలను ఉత్తేజితులను చేసింది. చేస్తూ ఉంది.

ఆకలి కేవలం ఆహార సంబంధిగానే ఉండదు కొంతమందికి. కొందరికి అంతు లేని సంపద మీద ఆకలి. కొండలు కోనలూ గనులూ పచ్చని వనాలూ.. అన్నిటినీ మింగేసేంత ఆకలిలో ఉంటారు. కొందరికి అధికారం మీద తీవ్రమైన ఆకలి. వాళ్లకు వీళ్లూ, వీళ్లకు వాళ్లూ సహకరించుకొని ఒకరి ఆకలిని మరొకరు తీర్చుకుంటూ ఉంటారు. మతాల మధ్య చిచ్చు పెట్టి, ఆ మంటల్లో చలికాచుకునే ఉన్మాదపుఆకలికొంతమందికి ఉంటుంది.

శాంతి,సామరస్యం, సహనం, సౌభ్రాతృత్వం వంటిదినుసులు వాళ్లకసలు పడవు. ఈ తరహా విపరీత ఆకళ్లను అరికట్టి, సమాజాన్ని ఆరోగ్యకరమైన దారిలో పెట్టాలంటే- ప్రజలే చైతన్యంతో తగిన చికిత్స అందించాల్సి ఉంటుంది.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు టారిఫ్‌ల ఆకలితో అల్లాడిపోతుంటే- అంతకన్నా ముందునుంచే ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు దురాక్రమణ యుద్ధాకలితో దహించుకుపోతున్నాడు. అనేక దేశాలూ, ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంస్థలు హితవు చెబుతున్నా- అతడి యుద్ధ జ్వలనం చల్లారటం లేదు. 2023 అక్టోబరు నుంచి ఇప్పటివరకూ పాలస్తీనా మీదా, గాజా ప్రాంతం మీదా ఎడతెగని దాడులు చేసి, 67 వేల మందికి పైగా ప్రజలను పొట్టన పెట్టుకున్నాడు. యుద్ధ సూత్రాలకు అన్ని విధాలా చెల్లు చీటీ రాసి, నేరుగా ప్రజల మీద బాంబులు కురిపించాడు. పాఠశాలల మీద, ఆసుపత్రుల మీద, యుద్ధ బాధితులు తలదాచుకున్న శిబిరాల మీదా కర్కశంగా బాంబులు కురిపించి, యుద్ధట్యాంకులు నడిపించి రక్తదాహం తీర్చుకున్నాడు. ఇజ్రాయిల్ తాను అమానవీయంగా పేట్రేగిపోవటంతో పాటు ప్రపంచ దేశాల మానవతా సాయం గాజా ప్రజలకు అందకుండా అడ్డుకుంటోంది. వేలాది ఆహార ట్రక్కులను అడ్డగించింది.

ఆహారపదార్థాలతో వచ్చిన ఓడలను అటకాయించి, వెనక్కు పంపేసింది. ఫలితంగా లక్షలాది మంది పాలస్తీనా పిల్లలూ ఆకలితో అల్లాడిపోతున్నారు. ఆధునిక కాలంలో ఇంతకుమించినఅనాగరిక, అమానుష దుష్కృత్యం మరొకటి లేదు. 'హమాస్ ఉగ్రవాదులే మాలక్ష్యం' అంటూ మొదలైన ఇజ్రాయేల్ యుద్ధాకలి ఇప్పుడు గాజాను సర్వనాశనం చేసే దిశగా సాగుతోంది. "గాజాను స్వాధీనం చేసుకుంటాం" అని నిర్భయంగా, నిరంకుశంగా నెతన్యాహు ప్రభుత్వం ప్రకటించింది. ఆకలి అన్నార్తులనే బాధకు గురి చేస్తుంది.

# పెళ్ళికొడుకు కి తప్పని లో లెవెల్ కల్వర్టుల గండం

### కల్వర్టు పై నుండి వరద ఉదృతి పెరగడం తో వరద లో చిక్కుకొని పోయిన పెళ్ళి బృందం పెళ్ళికొడుకుని మోసుకెళ్లిన బంధువులు



గన్నేరువరం: గన్నేరువరం ఊర చెరువు మత్తడి ప్రవాహం ఎక్కువై రాకపోకలు నిలిచిపోవడంతో గన్నేరువరం మండల కేంద్రంలో పెళ్లికి చేరుకోవలసిన పెళ్ళికొడుకు వాహనం వరద ఉదృతి మూలంగా రాకపోకలు నిలిపివేయడం మూలంగా

విధి లేని పరిస్థితిలో బంధువులు పెళ్ళికొడుకును భుజాలపై మోసుకుంటూ అవతలి ఒడ్డుకు చేర్చి మరో వాహనంలో తీసుకొని వెళ్లారు. లో లెవెల్ కల్వర్టు సమస్యతో గన్నేరువరం మండల ప్రజలు ప్రతి సంవత్సరం ఇలాంటి ఇబ్బందులే ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

# యంత్రాలను పూర్తి పని గంటలు వినియోగించాలి

### ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య



కమాన్ పూర్: సింగరేణి సంస్థ సంస్థ ఛైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం మల్టీ డిపార్ట్మెంట్ టీం సభ్యులు అన్నీ గనులలో కంపెనీ యొక్క స్థితి గతులను గురించి, ప్రస్తుత సంవత్సర ఉత్పత్తి లక్ష్యాలు, ఉత్పాదకత, పరికరాల వినియోగం, ఖర్చు, ఏరియాలో మరియు కంపెనీలో ఉత్పత్తి స్థితి మొదలైన అంశాలపై ఉద్యోగుల అభిప్రాయాలు తెలుసుకొనుటకు ఓసిపి 3 కృషి భవన్ మరియు షావల్,డ్రిల్ సెక్షన్ మరియు బేస్ వర్క్ షాప్ ఉద్యోగులు కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సమావేశానికి ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సమావేశములో 2025-26 సంవత్సరంలో కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకత మరియు బొగ్గు రవాణా, కంపెనీ లక్ష్యాలు, భూగర్భగనుల యంత్రముల వినియోగం, ఉపరితల గనుల భారీ యంత్రముల వినియోగం, సింగరేణి సంస్థ లో అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, కంపెనీ భవిష్యత్ ప్రణాళికలు మరియు ముందున్న సవాళ్లు, కంపెనీ లక్ష్యాలను సాధించడానికి మనమేం చేయాలి? తదితర అంశాలపైన మల్టీ డిపార్ట్మెంట్ టీం సభ్యులు ఉద్యోగుల నుండి వారి అభిప్రాయాలు, సూచనలు సలహాలు తీసుకోవడం జరిగింది. యంత్రాల ను పూర్తి పనిగంటలు వినియోగిస్తూ, సింగరేణి సంస్థ పోటీ ప్రపంచంలో నిలబడలంటే నాణ్యమైన బొగ్గు ను వినియోగదారులకు అందించాలని ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ బి.వెంకటయ్య గారు అన్నారు. మల్టీ డిపార్ట్మెంట్ టీం సభ్యులు ఎస్ఓ టు జీఎం ఎస్.సంతోష్ కుమార్, ఏరియా ఇంజినీర్ సుజన్ మెహ్రా,

డిజిఎం (పర్సనల్) అధికార ప్రతినిధి పి.అరవింద్ రావ్, డిజిఎం (ఐఈ) మురళీకృష్ణ, డీజీఎం ఫైనాన్స్ వెంకట రామచంద్ర ఉన్నారు. ఇంకా ఈ సమావేశంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రెటరీ జిగురు రవీందర్, ప్రాజెక్ట్ అధికారి ఉదయ్ హరిజన్, ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజాజీ, గని మేనేజర్ భారత్ కుమార్, ఏరియా సెక్యూరిటి అధికారి షరీఫ్ మహమ్మద్, బేస్ వర్క్ షాప్ ఇంచార్జ్ రాజశేఖర్, షావల్ ఇంచార్జ్ జనార్ధన్, సంక్షేమాధికారులు సాయికృష్ణ, అజీజ్, ఫిట్ సెక్రెటరీ మహేందర్ మరియు ఓసిపి 3 గని అధికారులు మరియు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి



జయశంకర్ భూపాలపల్లి: వాతావరణ శాఖ సూచన మేరకు రానున్న మూడు రోజులు జిల్లాలకు రెడ్ అలెర్ట్ ఉన్నందున జిల్లా యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఐడిఓసి కార్యాలయంలో రానున్న మూడు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సమాచారంపై అత్యవసరంగా పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, అగ్నిమాపక, పంచాయతి రాజ్, విద్యుత్తు, వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక శాఖల అఅధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర సేవల దృష్ట్యా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అత్యవసర సేవలకు కార్యదర్శి స్థాయి నుండి జిల్లా అధికారులు వరకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అత్యవసర సేవలకు ప్రజలు కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 24-7 పనిచేసే కంట్రోల్ రూము నంబర్ 9030632608 కు కానీ పోలీస్ కంట్రోల్ రూము నంబర్ 100కు కాల్ చేయాలని ఆయన సూచించారు. పశువులను ఆరుబయట మేతకు వదలకుండా ఇంటి పట్టునే వరద చేరని ప్రాంతాల్లో సురక్షితంగా ఉంచాలని సూచించారు. టైం టు టైం సిబ్బంది అలర్ట్ గా ఉండాలని ఆయన ఆదేశించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగడానికి వెళ్లేదని అన్ని ప్రణాళికలు సిద్ధం చేసుకుని క్షేత్రస్థాయిలో అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో కార్యదర్శి నుండి జిల్లా స్థాయి అధికారి వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తన అనుమతి లేకుండా కార్యస్థానం విడిచి వెళ్ళొద్దని స్పష్టం చేశారు. చెరువుల సామర్థ్యాలను పరిశీలించి పరిరక్షణ చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారు లను ఆదేశించారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావొద్దని, ఏ సమయంలో కుండపోత వర్షం పడుతుందో తెలీదని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాలర్లు చేపల వేటకు వెళ్ళొద్దని తెలిపారు. .పొంగి పొర్లుతున్న వాగులుదాటకుండా పటిష్ట బందోబస్తు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువులు, వాగులు, నదుల వద్దకు ప్రజలు వెళ్లకుండా నియంత్రణ చేయాలని అధికారులను ఆదేశించారు.

## పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు...

### అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

ఖమ్మం : పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. ఏన్కూరు, తల్లాడ మండలాల తహసిల్దార్ కార్యాలయాలు, ఏన్కూరు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల స్థితిగతులు, భూ భారతి పోర్టల్ తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తులపై నోటీసులు జారీ చేసి భూ భారతి

చట్టం నిబంధనల ప్రకారం వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో డైనింగ్ హాలు, కిచెన్ ను పరిశీలించారు. పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలని, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్లు సిహెచ్. శేషగిరిరావు, వి. సురేష్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వరద పరిస్థితులలో ప్రజారక్షణకు అప్రమత్తత చర్యలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల: వాతావరణ శాఖ నివేదిక ప్రకారం భారీ నుండి అతి భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజల రక్షణకు అధికార యంత్రాంగం అప్రమత్తత చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని పలు లోతట్టు వరద ప్రభావితం ప్రాంతాలు దెబ్బతిన్న రహదారులు వంతెనలు, కల్వర్టులు చెరువులు కుంటల వద్ద వరద పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న వర్ష పరిస్థితులలో ప్రజల శ్రేయస్సు దృష్ట్యా అధికార యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా రక్షణ కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యం, తక్షణ సహాయం కొరకు జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నంబర్ 08736- 250501 ఏర్పాటు చేసి 24 గంటలు తక్షణ సహాయ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లోతట్టు వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి రక్షణ చర్యలు చేపడుతుందని ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. రైతులు పొలాలలో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలని విద్యుత్ స్తంభాలు ట్రాన్స్ఫార్మర్లు వంతెనలు ఉదృతంగా ప్రవహిస్తున్న వాగులు నదుల వద్దకు ఎవరు వెళ్లకూడదని తెలిపారు. ప్రజలు అత్యవసరం అయినప్పుడు మాత్రమే బయటకు రావాలని జిల్లాలో జరిగే ఘటనలు వరద నీటి సమాచారం తక్షణమే కంట్రోల్ రూమ్ కు అందించాలని ప్రజల సంక్షేమం కోసం చర్యలు తీసుకునేందుకు వీలవుతుందని తెలిపారు. తాండూర్ మండల కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద పరిస్థితిని పరిశీలించి ప్రజలు అటువైపుగా రాకుండా పోలీస్ రెవెన్యూ, గ్రామపంచాయతీ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించి తక్షణమే భారీ కేడ్లు ఏర్పాటు చేయించారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని రామ్ నగర్ ప్రాంతంలో రోడ్లపై నుండి వరద నీరు ప్రవహించడాన్ని పరిశీలించి వెంటనే నీటిని తొలగించేలా అధికారులను ఆదేశించి చర్యలు చేపట్టారు.

కన్నెపల్లి మండలం సాలిగాం గ్రామం లోనికి చేరిన పాల్వాయి పురుషోత్తం రావు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ పరిస్థితిని పరిశీలించి ప్రమాద స్థాయిలో ఉన్న ఇండ్ల ప్రజలను పునరావాసంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలకు తరలించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణలో భాగంగా బ్లీచింగ్ ఫాగింగ్ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భీమిని మండలం చిన్న తిమ్మాపూర్ గ్రామంలోని ఎర్రవాగు లోనికి బ్యాక్ వాటర్ స్థితిని పరిశీలించి 3 ఇండ్ల ప్రజలను ప్రభుత్వ పాఠశాలకు తరలించి పునరావస చర్యలు చేపట్టారు. రాజారాం గ్రామంలో భీమిని -బిట్టర్ పల్లి గ్రామాల మధ్య దెబ్బతిన్న రహదారి, కల్వర్టు లను పరిశీలించి వెంటనే మరమ్మత్తులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

భీమిని మండలంలోని ఖర్జీభీం పూర్ గ్రామంలో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంచాయితీ రాజ్ రోడ్డు వంతెనను పరిశీలించి వెంటనే పనులు చేపట్టాలని పంచాయితీ రాజ్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వర్ష పరిస్థితులలో అధికార యంత్రాంగం అహర్నిశలు ప్రజా సంక్షేమం దిశగా చర్యలు తీసుకుంటుందని అవసరమైన ప్రాంతాలలో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, గర్భిణుల సంక్షేమ దృష్ట్యా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

జిల్లాలో వరద నీరు అవాంఛనీయ ఘటనలు జరిగినట్లయితే వెంటనే కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించాలని ప్రజల రక్షణ కోసం తక్షణ సహాయ చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యతరగతికి భారీ ఊరట..

# ఎనిమిదేళ్ల కనిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం..!



ఢిల్లీ,: సామాన్యులకు ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలకు భారీ ఊరట లభించింది. దేశంలో రిటైల్ (చిల్లర) ద్రవ్యోల్బణం గత ఎనిమిదేళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ఠస్థాయికి పడిపోయింది. ఈ ఏడాది జూలై నెలకుగాను రిటైల్ ద్రవ్యోల్బణం కేవలం 1.55 శాతంగా నమోదైనట్లు ప్రభుత్వం విడుదల చేసిన ప్రాథమిక గణాంకాలు స్పష్టంచేశాయి. 2017 జూలై తర్వాత రిటైల్ ద్రవ్యోల్బణం ఇంత తక్కువగా నమోదుకావడం ఇదే తొలిసారి. జూన్ నెలలో 2.10 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం ఒక్క నెలలోనే 55 బేసిస్ పాయింట్లు తగ్గి 1.55 శాతానికి పడిపోయింది. ఆహార పదార్థాల ధరలు గణనీయంగా తగ్గడమే రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుదలకు ప్రధాన కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆహార ద్రవ్యోల్బణం ఏకంగా మైనస్ 1.76 శాతానికి పడిపోయింది. 2019 జనవరి తర్వాత ఆహార ధరలు ఈ స్థాయిలో తగ్గడం ఇదే మొదటిసారి. ముఖ్యంగా పప్పుధాన్యాలు, కూరగాయలు, తృణధాన్యాలు, గుడ్లు, చక్కెర లాంటి నిత్యావసరాల ధరలు దిగిరావడం సామాన్యుడికి పెద్ద ఉపశమనం కలిగించింది. రవాణా, కమ్యూనికేషన్, విద్యా రంగాల్లోనూ ధరలు తగ్గుముఖం పట్టాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండింటిలోనూ ద్రవ్యోల్బణం తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో 1.72 శాతం ఉండగా జూలైలో 1.18 శాతానికి తగ్గింది. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో 2.56 శాతం నుంచి 2.05 శాతానికి దిగివచ్చింది. రెండు ప్రాంతాల్లోనూ ఆహార పదార్థాల ధరలు రుణాత్మక స్థాయిలోనే నమోదయ్యాయి.

అయితే, కొన్ని రంగాల్లో మిశ్రమ ఫలితాలు కనిపించాయి. గృహ నిర్మాణ రంగంలో ద్రవ్యోల్బణం 3.17 శాతం వద్ద స్థిరంగా ఉండగా, ఆరోగ్య రంగంలో స్వల్పంగా 4.57 శాతానికి పెరిగింది. ఇంధనం, విద్యుత్ రంగాల్లో కూడా స్వల్ప పెరుగుదల నమోదైంది. దీనిపై ఎల్, టీ గ్రూప్ చీఫ్ ఎకనామిస్ట్ సచ్చిదానంద్ శుక్లా మాట్లాడుతూ.. ద్రవ్యోల్బణం తగ్గడం ఇది వరుసగా తొమ్మిదోసారి అన్నారు. బహుశా ఇదే కనిష్ఠ స్థాయి కావచ్చని అభిప్రాయపడ్డారు. 2026 మార్చి నాటికి ద్రవ్యోల్బణం ఇప్పుడున్న దానికి మూడు రెట్లు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అంచనా వేశారు.

# సినిమా..

## ఓజిలో ఆ యాంగిల్ కూడా ఉందా..?



ఎంతో కసి మీదున్న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఆకలిని హరి హర వీరమల్లు సినిమా తీర్చలేకపోయింది. రెండేళ్ల తర్వాత పవన్ ను స్క్రీన్ పై చూశామనే తృప్తిని తప్పించి, ఫ్యాన్స్ పవన్ ను చూడాలనుకుంటున్న విధంగా ఆ సినిమాలో చూపించలేకపోయారు. దీంతో పవన్ ఫ్యాన్స్ ఆశలన్నీ ఓజిపైనే ఉన్నాయి. ఓజిలో తాము కోరుకున్నవన్నీ దొరుకుతాయని పవర్ స్టార్ ఫ్యాన్స్ చాలా బలంగా నమ్ముతున్నారు. ఓజీపై భారీ అంచనాలు సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఓజిపై డే1 నుంచే భారీ అంచనాలున్నాయి. పవనే కాదు, ఆ సినిమాకు సంబంధించిన ఎవరు ఎక్కడ కనిపించినా సమయం, సందర్భంతో పన్లేకుండా పవన్ ఫ్యాన్స్ ఓజి పేరుని జపిస్తూనే వస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ పూర్తి కాగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ లో చిత్ర యూనిట్ బిజీగా ఉంది. ఫస్ట్ సాంగ్ కు మంచి రెస్పాన్స్ రీసెంట్ గా ఈ సినిమా నుంచి ఫైర్ స్టార్మ్ అంటూ సాగే ఫస్ట్ లిరికల్ ను మేకర్స్ రివీల్ చేయగా ఆ సాంగ్ కు ఫ్యాన్స్ నుంచి విపరీతమైన రెస్పాన్స్ వస్తోంది. చాలా ఏళ్లుగా పవన్ ను ఫ్యాన్స్ ఎలాగైతే చూడాలని ఆశపడ్డారో, ఈ సినిమాలో సుజిత్ అలానే చూపించారని ఫస్ట్ సాంగ్ తోనే క్లారిటీ వచ్చేసింది. తమన్ కంపోజిషన్ లో వచ్చిన ఈ సాంగ్ లో పవన్ ఎంతో స్టైలిష్ గా కనిపించారు. సాంగ్ లో పవన్ లుక్స్ కూడా స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచాయి. త్వరలోనే ఓజి సెకండ్ సాంగ్ ముంబై బేస్డ్ మాఫియా డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 25న రిలీజ్ కానున్న విషయం తెలిసిందే. ఆల్రెడీ ఫస్ట్ సాంగ్ తో మంచి రెస్పాన్స్ ను అందుకున్న ఓజి చిత్ర యూనిట్, ఇప్పుడు ఓజి నుంచి సెకండ్ సాంగ్ ను రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఓజి నుంచి తర్వాత వచ్చే సాంగ్ రొమాంటిక్ మెలోడీ సాంగ్ అని, ఆ పాటను లెజెండరీ సింగర్ చిత్ర ఆలపించారని తెలుస్తోంది. త్వరలోనే మేకర్స్ ఆ సాంగ్ ను రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇప్పటివరకు ఓజిను కేవలం ముంబై బేస్డ్ మాఫియా డ్రామాగానే అనుకుంటున్న టైమ్ లో మెలోడీని రిలీజ్ చేసి ఓజిలోని మరో యాంగిల్ ను చూపించాలని మేకర్స్ భావిస్తున్నారట. ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా నటిస్తోన్న ఈ సినిమాలో ఇమ్రాన్ హష్మీ నెగిటివ్ రోల్ లో కనిపించనున్నారు.

## జగపతి బాబు షోలో సందడి చేసిన నాగార్జున..




టాలీవుడ్‌లో ఇప్పుడు ట్రెండ్ మారింది. సినిమాల్లోనటించే స్టార్లు టీవీ, ఓటీటీ షోల హోస్టులుగా మారి ప్రేక్షకులని ఎంతగా అలరిస్తున్నారో మనంచూస్తూనే ఉన్నాం. ఇప్పటికే చిరంజీవి,బాలయ్య, నాగార్జున వంటి వారు సందడి చేస్తుండగా, ఇప్పుడు ఈ జాబితాలో చేరారు జగపతి బాబు. హీరోగా ఎన్నో విజయవంతమైన సినిమాలు చేసిన ఆయన, రెండో ఇన్నింగ్స్‌లో విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మళ్లీ మంచి గుర్తింపు పొందారు. ఇప్పుడు మరో కొత్త పాత్రలో హోస్ట్‌గా'జయమ్ము నిశ్చయ మ్మురా' అనే టాక్ షోతో ప్రేక్షకులను ఆకట్టుకోబోతున్నారు. ఈ షోలో ప్రముఖుల్ని ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తూ, వారి జీవితంలో ఆసక్తికర ఘటనలు, భావోద్వేగాలు, అనుభూతులను చర్చించనున్నారు. ఇప్పటికే మొదటి ఎపిసోడ్ ప్రోమో రిలీజ్ అయింది. దీనికి కింగ్ నాగార్జున ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు ఆయన అన్నయ్య వెంకట్, సోదరి నాగ సుశీల కూడా ఈ ఎపిసోడ్‌లో పాల్గొన్నారు. ఈ ఇంటర్వ్యూలోవారుఎన్నో వ్యక్తిగత విషయాలు పంచుకున్నట్లు తెలుస్తోంది. ప్రోమోలో వారిద్దరి మధ్య హాస్యం, స్నేహితుల మధ్య ఉండే అనుబంధం స్పష్టంగా కనిపించింది. ఓ సందర్భంలో జగపతి బాబు..రమ్యకృష్ణ, టబు గురించి నాగ్‌ని అడగగా, అందుకు సమాధానం చెప్పనని అన్నాడు. అలానే నీ ఫేవరేట్ యాక్ట్రెస్ రమ్యకృష్ణ, సౌందర్యనా అని తిరిగి నాగ్ ప్రశ్నించాడు. దాంతో జగపతి బాబు ఇది నా ఇంటర్వ్యూ కాదని అన్నాడు. ప్రస్తుతం ఈ ప్రోమో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

జగపతి బాబు, నాగార్జున ఫ్యాన్స్ షో కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ టాక్ షో జీ తెలుగు ఛానల్‌లో ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు ప్రసారమవుతుంది. మొదటి ఎపిసోడ్ ఆగస్టు 17న టెలికాస్ట్ కానుంది. ఇప్పటికే వినూత్న కాన్సెప్ట్‌తో అందరినీ ఆకట్టుకుంటున్న


'జయమ్ము నిశ్చయమ్మురా' షో, జగపతి బాబుకు హోస్ట్‌గా మరో విజయవంతమైన ప్రస్థానానికి నాంది పలకుతుందేమో చూడాలి. విలన్‌గా అదరగొడుతున్న జగపతి బాబు ఇప్పుడు హోస్ట్‌గా కూడా సత్తా చాటుతాడా అనే దాని కోసం కొద్ది రోజులు వెయిట్ చేయక తప్పదు.

## ఆలియా, దీపికా లిస్ట్ లోకి కియారా కూడా..!

అమ్మతనం లైఫ్ మొత్తాన్ని మార్చేస్తుంది. అప్పటివరకు ఒకలా ఉంటే ఓ బిడ్డకు జన్మనిచ్చి తల్లిగా మారాక తమ జీవితం మొత్తం మారిపోతుంది. ప్రతీ విషయాన్ని చాలా క్షుణ్ణంగా ఆలోచించి, ఎంతో జాగ్రత్తలుగా నిర్ణయాలు తీసుకుంటూ ఉంటారు. సెలబ్రిటీలు కూడా అందుకు అతీతులు కాదు. ఈ విషయాన్ని ఇప్పటికే పలువురు స్టార్ హీరోయిన్లు బహిరంగంగా వెల్లడించిన విషయం తెలిసిందే. కూతురు పుట్టాక చాలా మార్పులొచ్చాయని ఆలియా భట్ చెప్తే, కూతురు పుట్టిందనే కారణంతో పర్సనల్ లైఫ్ కు మరింత టైమ్ కేటాయించాలని దీపికా పడుకొణె ఆలోచించి, తన కూతురు కోసం సినిమాల ఎంపిక విషయంలో కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఆ లిస్ట్ లోకి బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ కూడా వచ్చింది. మాకొద్దు బాబోయ్ కియారా అద్వానీ- సిద్దార్థ్ మల్హోత్రా జులైలో ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మదర్‌హుడ్ ను ఎంజాయ్ చేస్తున్న కియారా కూతురు పుట్టాక తన జీవితమే మారిపోయినట్టు రీసెంట్ గా ఓ పోస్ట్ చేశారు. కూతురితో ఎంతో విలువైన సమయాన్ని గడుపుతున్న కియారా తన కూతురి గురించి చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. నేను నీ డైపర్లు మారుస్తున్నాను. నువ్వేమో నా ప్రపంచాన్నే మార్చేశావ్.. ఈ డీల్ చాలా బావుందంటూ ఓ కొటేషన్ ఉన్న ఫోటోని తన ఇన్‌స్టా స్టోరీలో షేర్ చేయడమే కాకుండా హ్యాండ్స్ తో హార్ట్ సింబల్, కళ్లలో నీళ్లు తిరిగే ఎమోజీలను షేర్ చేశారు. షేర్షా సినిమా టైమ్ లో బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాతో ఏర్పడిన పరిచయం ఆ తర్వాత ప్రేమగా మారగా 2023లో వీరిద్దరూ పెళ్లితో ఒక్కటయ్యారు. పెళ్లైన రెండేళ్లకి రీసెంట్ గా వారికి ఓ పాప పుట్టింది. సినిమాల విషయానికొస్తే ప్రస్తుతం కూతురితో బిజీగా ఉన్న కియారా నటించిన వార్2 సినిమా ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ సినిమాలో హృతిక్ కు జోడీగా కియారా నటించారు. దీంతో పాటూ యష్ హీరోగా తెరకెక్కుతున్న టాక్సిక్ సినిమాలో కూడా కియారా నటిస్తున్నారు. సిద్ధార్థ్ మల్హోత్రా నటించిన పరమ్ సుందరి ఆగస్ట్ 29న రిలీజ్ కానుంది.



## వర్కవుట్ చేద్దాం ఫ్రెండ్స్..



'జిమ్‌కు ఎందుకు వెళ్తున్నావ్?' అని ఎవరినైనా అడిగితే.. స్లిమ్ కావడానికనో.. కండలు పెంచడానికనో సమాధానం చెప్పడం సహజం. కానీ, నేటి యంగ్ తరంగ్‌లు దీనికి భిన్నంగా స్పందిస్తున్నారు. 'ఫిట్‌నెస్ కోసం మాత్రమే కాదు.. ఫ్రెండ్‌షిప్ కోసం కూడా' అని చెబుతున్నారు. జిమ్‌లో కేవలం చెమటలు కక్కడమే కాదు.. చనువుగా మాటలూ కలుపుతున్నారు. కండలు మాత్రమే కాదు.. నెట్‌వర్క్ కనెక్షన్లూ పెంచుకుంటున్నారు. 'ఫిట్‌నెస్.. ఫ్లెక్సింగ్.. ఫ్రెండ్‌షిప్' అన్నీ కలిపి జెన్ జెడ్ కొత్త ట్రెండ్‌ను ఫాలో అవుతున్నది. ఆన్‌లైన్‌లో దొరికే దోస్తుల కన్నా.. జిమ్‌లో కలిసే ఫ్రెండ్ బెస్ట్ అంటున్నది నేటి తరం. ఇతర వేదికల్లో పరిచయాలైన తర్వాత.. అభిరుచులు కలిస్తేనే స్నేహం చిగురించే అవకాశాలు ఉంటాయి. అదే జిమ్ స్నేహాల్లో అందరి కామన్ మంత్రం ఫిట్‌నెస్. అభిరుచులు కలిసిన తర్వాత అభిప్రాయాలు కలవడం ఎంతసేపు? అందుకే, జిమ్ స్నేహాలు ఇటీవల తెగ వర్కవుట్ అవుతున్నాయని పలు డేటింగ్ యాప్‌లు నిర్వహించిన సర్వేల్లో తేటతెల్లమైంది. డేటింగ్ యాప్ బంబుల్ 'ఫిట్‌నెస్ సెంట్రిక్ డేట్స్' కోసం క్యాంపెయిన్లు కూడా మొదలుపెట్టింది. వీళ్లు నిర్వహించిన ఓ సర్వేలో 52 శాతం జెన్ జెడ్ ఇండియన్ సింగిల్స్.. ఫిట్‌నెస్ సెంట్రిక్ డేట్‌కి ఆసక్తి చూపిస్తున్నారట. 95 శాతం మంది 'స్పోర్ట్స్ ఫస్ట్ డేట్'కి ఓటేస్తున్నారట. తమ పార్ట్‌నర్‌కు గానీ, ఫ్రెండ్‌కు గానీ ఆటలపై మోజు లేకుంటే 44 శాతం మంది వారితో 'డీల్ బ్రేకప్' అని నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారట. అంతేకాదు, వర్కవుట్ ప్లేస్‌లో చిగురించిన స్నేహాలు.. యువతను జిమ్‌కు ఉత్సాహంగా వెళ్లడానికి ప్రేరణగా నిలుస్తున్నాయట కూడా!

**కొంగుముడి దాకా..:** 2024లో స్పోర్ట్ అండ్ ఫిట్‌నెస్ యాప్ స్ట్రావా విడుదల చేసిన 'ఇయర్ ఇన్ స్పోర్ట్' సర్వే రిపోర్ట్ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఈ సర్వేలో పాల్గొన్నవారిలో 58 శాతం మంది తమకు జిమ్‌లో కొత్త ఫ్రెండ్ కలిశారని చెప్పుకొచ్చారు. ఇక ప్రతి ఐదుగురిలో ఒకరు తమ వర్కవుట్ ఫ్రెండ్‌తో డేటింగ్‌కు కూడా వెళ్తున్నారని వెల్లడైంది. వీరిలో కొందరు కొంగుముడి కూడా వేసుకుంటున్నారట. పబ్ కన్నా..

జిమ్‌లో ఏర్పడే పరిచయాలు సురక్షితం, సున్నితం, ఉపయోగకరం అని ఈ జనరేషన్ భావిస్తున్నది. జిమ్‌లు కొందరికి డేటింగ్‌కు దారి చూపితే.. మరికొందరికి కెరీర్ నెట్‌వర్కింగ్ హబ్‌లా పనిచేస్తున్నాయి. 'నా జిమ్ ఫ్రెండ్ ద్వారా నాకు జాబ్ రిఫరల్ కూడా వచ్చింది' అని హ్యాపీగా పోస్టు చేస్తున్నారు పలువురు.

**సోషల్ క్లబ్స్‌గా..:** నయా జనరేషన్ ఆసక్తులను గమనించిన జిమ్ నిర్వాహకులు తమ కార్యకలాపాల్లో మార్పులు తీసుకొస్తున్నారు. కల్ట్‌ఫిట్ లాంటి సంస్థలు క్లయింట్స్ కోసం గ్రూప్ వర్కవుట్స్ అందిస్తు న్నాయి. మైక్రో ఈవెంట్లు, జాయింట్ వర్కవుట్స్, టీమ్ బేస్డ్ ఇలా రకరకాల చాలెంజెస్‌ని పరిచయం చేస్తున్నాయి. జిమ్‌లో చిగురించిన బంధాలు మరింత బలపడటానికి క్రాఫ్ట్ వర్క్‌షాప్స్, మారథాన్స్, పెయింటింగ్ సెషన్స్ కూడా నిర్వహిస్తున్నాయి. అందుకే, జిమ్ అంటే తమకు రొటీన్ కాదనీ, రిలేషన్స్‌కు వారధి అని భావిస్తున్నారు యువతీయువకులు. కలిసి వర్కవుట్ అయినప్పుడు కలిసి జీవించేం దుకు ఇష్టపడుతున్నారు. ట్రెడ్‌మిల్‌పై పరుగులు తీస్తూ.. ట్రెండింగ్‌గా పార్ట్‌నర్‌ని వెతుక్కుంటున్నారు. మొత్తంగా జిమ్ బాట పట్టినవారు ఫిట్‌నెస్ సంపాదించుకోవడంతో పాటు బోనస్‌గా సామాజికంగా యాక్టివ్‌గా మారుతున్నారు. ఈ ట్రెండ్‌ను మనమూ స్వాగతిద్దాం!!

## అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉండాలని చూస్తున్నారా..?



ఆరోగ్యంగా ఉండేందుకు మనకు అనేక రకాల డైట్స్ అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా సరే తమ సౌకర్యానికి అనుగుణంగా ఉండే డైట్‌ను పాటిస్తుంటారు. అయితే ప్రస్తుతం ఒక డైట్ మాత్రం బాగా ట్రెండింగ్‌లో ఉంది. అదే మైండ్ డైట్. రెండు రకాల డైట్‌లను కలిపి ఈ డైట్‌ను రూపొందించారు. మెడిటరేనియన్‌తోపాటు డ్యాష్ డైట్‌ను కలిపి మైండ్ డైట్‌ను రూపొందించారు. రష్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌కు చెందిన పరిశోధకులు ఈ డైట్‌కు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా పలు ఆహారాలను వారంలో నిర్దిష్టమైనన్ని సార్లు కచ్చితంగా తీసుకోవాలి. అలాగే కొన్ని ఆహారాలను తీసుకోవడం మానేయాలి. లేదా వారంలో చాలా తక్కువ సార్లు తీసుకోవాలి. ఇలా మైండ్ డైట్‌ను పాటించాల్సి ఉంటుంది. దీంతో అనేక ప్రయోజనాలు పొందవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. **ఏం తినాలి..?:** మైండ్ డైట్‌లో బాగంగా వారంలో కనీసం 6 సార్లు కూరగాయలు, ఆకుకూరలను తినాలి, పిండి పదార్థాలు లేని కూరగాయలను ఏదో ఒకటి కచ్చితంగా రోజూ తినాలి. వారంలో కనీసం 2 సార్లు బెర్రీలను తినాలి. వారంలో కనీసం 5 సార్లు నట్స్‌ను తీసుకోవాలి. రోజూ ఆలివ్ ఆయిల్‌ను వంటలకు కచ్చితంగా ఉపయోగించాలి. ఓట్ మీల్, బ్రౌన్ రైస్‌ను వారంలో కనీసం 3 సార్లు తినాలి. వారానికి ఒకసారి చేపలను కచ్చితంగా తినాలి. వారంలో 3 సార్లు బీన్స్, వారానికి 2 సార్లు చికెన్ లేదా కోడిగుడ్లను, రోజుకు ఒక గ్లాస్ వైన్‌ను (వీలుంటే) తాగాలి. ఇలా మైండ్ డైట్‌లో భాగంగా ఈ ఆహారాలను కచ్చితంగా తీసుకోవాల్సి ఉంటుంది.

**ఏం తినకూడదు..?:** మైండ్ డైట్‌ను పాటించే వారు మటన్ తినకూడదు. లేదా వారంలో ఒకసారి తినవచ్చు. అంతకు మించరాదు. వెన్న, నెయ్యి రోజుకు ఒక టీస్పూన్ మించకూడదు. చీజ్‌ను వారంలో ఒకసారి మాత్రమే తినవచ్చు. పేస్ట్రీలు, స్వీట్లను కూడా వారంలో ఒకసారి మాత్రమే తినాలి. వేపుళ్లను కూడా వారంలో ఒకసారి మించి తినకూడదు. ఇక మైండ్ డైట్‌ను పాటిస్తే అనేక లాభాలను పొందవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. మైండ్ డైట్‌ను పాటించడం వల్ల అల్జీమర్స్ వచ్చే రిస్క్ చాలా వరకు తగ్గుతుందని చెబుతున్నారు. ముఖ్యంగా వయస్సు మీద పడిన వారిలో అల్జీమర్స్ అధికంగా వస్తుంది. కానీ మైండ్ డైట్‌ను పాటిస్తే అల్జీమర్స్ రాకుండా చూసుకోవచ్చు. అలాగే మెదడు యాక్టివ్‌గా మారి ఉత్తేజంగా పనిచేస్తుంది. బద్దకం పోతుంది. రోజంతా ఉత్సాహంగా ఉంటారు. వృద్ధాప్యంలో మతిమరుపు కూడా రాకుండా అడ్డుకోవచ్చు.

**లాభాలు..:** మైండ్ డైట్‌ను పాటిస్తే శరీరానికి అనేక విటమిన్లు, మినరల్స్ లభిస్తాయి. ముఖ్యంగా విటమిన్లు ఎ, కె, బి విటమిన్లు పొందవచ్చు. ఫోలేట్, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా లభిస్తాయి. ఇవి మెదడును సంరక్షిస్తాయి. కణాలు వాపులకు గురి కాకుండా ఉంటాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. క్యాన్సర్, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. మైండ్ డైట్ వల్ల హృదయ సంబంధిత వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. బీపీ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ లెవల్స్ అదుపులో ఉంటాయి. మైండ్ డైట్‌ను పాటిస్తే తీవ్రమైన వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. అయితే ఈ డైట్‌ను పాటించడం అంత తేలికేమీ కాదని, న్యూట్రిషనిస్టులతోపాటు డాక్టర్ సలహాను పాటించి మాత్రమే ఈ డైట్‌ను అనుసరించాలని, అప్పుడే ఉత్తమ ఫలితాలను రాబట్టవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215